మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక గొడవ జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సిబ్బంది అక్కడకు వెళ్లారు. వారిపై గంజాయి మత్తులో గొడవపడుతున్న యువకులు దాడికి తెగబడ్డారు. దీంతో భయపడి పోలీసు సిబ్బందే అక్కడి నుంచి పరుగులు తీయాల్సి వచ్చింది.

పట్టణంలోని ఏబీఎం పాఠశాల వద్ద యువకులు గొడవపడుతున్నారు. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఆ గుంపును వారించాడు. దీంతో పూర్తిగా గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు సర్జికల్ బ్లేడుతో వారించిన ఆ వ్యక్తిపై దాడి చేశాడు. ఆయన అప్రమత్తంగా ఉండడంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.

నాగులవరం రోడ్డులో ఉన్న ఓ సినిమా థియేటర్ ప్రాంతంలో చీకటి పడితేచాలు యువత రెచ్చిపోతోంది. అటువైపు వెళ్లే వారిని ఎవరినీ వదలకుండా గొడవలు పెట్టుకోవడం, దాడులకు దిగడం రివాజుగా మారింది. పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

టీటీడీ కల్యాణ మండపం ఎదురు ఓ ప్రైవేటు వైద్యశాల దగ్గర నిర్మానుష్యంగా ఉన్న సందులో నిత్యం పదుల సంఖ్యలో యువకులు గంజాయి తాగుతుంటుంటారు. మత్తు ఎక్కువై పలు సందర్భాల్లో వారిలో వారే రోడ్డుపైకి వచ్చి దాడులు చేసుకున్న ఘటనలు ఉన్నాయి.



మార్కాపురంలో గంజాయి మత్తులో ఆకతాయిలు చేస్తున్న అకృత్యాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. వెలుగులోకి రానివి అనేకం ఉన్నాయి. పశ్చిమ ప్రకాశంలో గంజాయి ముఠాలు రెచ్చిపోతున్నాయి. యథేచ్ఛగా సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయి. కొన్నిచోట్ల ఆ మత్తులో యువకులు దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులు, ఇతర యంత్రాంగం ఈ విష సంస్కృతిపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

పెడదారి

గంజాయికి అడ్డాగా మారిన పశ్చిమ ప్రకాశం

- మత్తుకు బానిసవుతున్న యువత
- రాత్రుళ్లు శబ్దకాలుష్యంతో బైక్ రైడింగ్
- గ్రూపులుగా ఏర్పడి రోడ్లపై సంచారం
- హైవేపై లారీలను ఆపి దందా
- వరుసగా వెలుగుచూస్తున్న ఘటనలు

మార్కాపురం/కంభం, జూలై 10 : మార్కాపురం డివిజన్‌లో గంజాయి వినియోగం తారస్థాయికి చేరింది. వందలాది మంది యువత మత్తుకు బానిసయ్యారు.

రోడ్లపై హల్‌చల్

గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గంజాయి, ఇతర మత్తుపదార్థాలు సాగు చేసేవారు ఎక్కువయ్యారు. పలుచోట్ల వ్యవసాయ పొలాల్లో గంజాయి సాగు చేస్తూ కొంతమంది పట్టుబడినప్పటికీ, అప్పటి రాజకీయ నాయకుల ఒత్తిడి వలన సంబంధిత అధికారులు కేసులు నమోదు చేయకుండా వదిలేసిన ఉదంతాలు ఉన్నాయి. దీంతో గంజాయి సరఫరా చేస్తూ అధిక మొత్తంలో సొమ్ము చేసుకునే వారు, మత్తులో తూగే యువత సంఖ్య ఎక్కువైంది. గంజాయి తాగే యువత రోజూ అర్ధరాత్రి తరువాత హైవే రోడ్డుపై లారీలను ఆపి డ్రైవర్లను బెదిరిస్తూ దందా చేస్తున్నారు. రేషన్‌బియ్యంతో వెళుతున్న వాహనాలను ఆపి బెదిరించిన ఘటనలూ ఉన్నాయి. ఇక రోజూ బైక్‌లకు సైలెన్సర్లు తీసేసి వేగంగా నడుపుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు రాత్రివేళ నిఘా వేసి హైవే రోడ్లపై దందాకు పాల్పడేవారిని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.



వారిలో పేద, ధనిక అనే తేడా లేకుండా అన్నివర్గాల వాళ్లు ఉన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చాలామంది గంజాయి మత్తుకు బానిసలైనట్లు తెలుస్తోంది. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా గంజాయి సేవిస్తున్నారు. మత్తు పదార్థం వారికి అందుబాటులో ఉండటంతో ఆ కైపులో రెచ్చిపోతున్నారు. చివరికి మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఓ ఇంట్లోనే గంజాయి మొక్కలు పెంచుతున్నారంటేనే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్కాపురం పట్టణానికి కంభం, గిద్దలూరు, నంద్యాల ప్రాంతాల నుంచి గంజాయి సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. నల్లమల అటవీ ప్రాంతం చుట్టుపక్కల నుంచి గంజాయిని సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సమాచారం. ఒక్క మార్కాపురం పట్టణంలోనే రోజుకు సుమారు రూ.లక్ష మేర గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని అంచనా. గ్రామీణ ప్రాంతాలకు సైతం ఈ వ్యసనం పాకినట్లు తెలుస్తోంది.

ఉక్కుపాదం మోపాల్సిందే..

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చిందని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలుమార్లు విమర్శించారు. ఉపాధి అవకాశాలు లేక యువత మత్తు పదార్థాలకు అలవాటుపడ్డారని ఆయన పదేపదే ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వస్తే గంజాయి మత్తు నుంచి యువతను కాపాడుతానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హోంమంత్రిగా అనిత బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రథమ ప్రాధాన్యతగా గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమయ్యారు. అందులోభాగంగా ఇప్పటికే పోలీసు, ఎక్సైజ్‌శాఖలకు గంజాయిని అరికట్టేందుకు 100 రోజుల కార్యక్రమం రూపొందించారు. ముందుగా సాగు, ఆ తర్వాత రవాణాపై దృష్టి సారించాలని ఆదేశించారు. అంతేకాక గంజాయి కేసుల్లో జైళ్లలో ఉన్న వారితో కూడా ఆమె స్వయంగా వెళ్లి మాట్లాడారు. వారి పరిస్థితిని చూసి డీఎడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. గంజాయి మత్తుకు బానిసలైన యువత మార్కాపురం డివిజన్‌లోనూ పెద్ద సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా డీఎడిక్షన్ సెంటర్ పెంచాల్సిన అవసరం ఉంది.

కంభం ఘటనతో పోలీసుల అప్రమత్తం

తీగ లాగితే డొంక కదిలినట్లుగా కంభంలో పలువురు యువకులు మత్తు పదార్థాలు సేవించి బహిరంగంగా తిరుగుతూ గత సోమవారం పోలీసులకు పట్టుబడ్డ విషయం విదితమే. వీరి వద్ద 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వీరికి ఎర్రగొండపాలెం నుంచి ప్రతి రోజూ గంజాయి సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. పోలీసులు స్పందించి ఎర్రగొండపాలెం, మార్కాపురంలలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పశ్చిమ ప్రకాశంలో సువిశాల అటవీ ప్రాంతాలు గంజాయి సాగుకు అడ్డాగా మారినట్లు సమాచారం.

పొగాకు మార్కెట్లో సంక్షోభం

- తొమ్మిది కేంద్రాల్లో నిలిచిన వేలం
- అధికోత్పత్తి కొనుగోలు విషయాన్ని తేల్చని కేంద్రం
- దక్షిణాది రైతుల వద్ద ఇంకా 49 మిలియన్ కిలోల పంట
- ఆశాజనక వేళ సాగుదారుల్లో ఆందోళన



ఒంగోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్లో సంక్షోభం నెలకొంది. ఈ ప్రాంతంలోని 11 వేలంకేంద్రాల్లో ఏకంగా తొమ్మిది చోట్ల కొనుగోళ్లు నిలిచిపోయాయి. రెండింటిలో మాత్రమే కొనసాగుతున్నాయి. పండిన పంటలో రైతుల వద్ద ఇంకా మూడో వంతు ఉండగా ఈ సమయంలో కొన్ని కేంద్రాల్లో పదిరోజులు, మరికొన్నింటిలో వారం రోజులుగా వేలం నిలిచిపోయింది. గతంలో ఎన్నడూ లేనంత డిమాండ్ ఈ ఏడాది పొగాకుకు ఉంది. బోర్డు చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా గరిష్ఠ ధర ఏకంగా కిలో రూ.365కి చేరింది. ఎక్కువశాతం మేలురకం పంటను కిలో రూ.300పైనే వ్యాపారులు కొనుగోలు చేశారు. మీడియం, లోగ్రేడ్‌లకు సైతం భారీగానే ధరలు లభించాయి. అలా ఇప్పటివరకు 90 మిలియన్ కిలోలు కొనుగోలు చేయగా సగటున కిలోకు రూ.252.33 ధర లభించింది. ఈస్థాయి రేట్లను ఇటు రైతులు, అటు బోర్డు అధికారులు ఊహించలేదు. అంతర్జాతీయంగా పంట ఉత్పత్తి తగ్గడంతో ఇక్కడ భారీ డిమాండ్ ఏర్పడి ఆమేరకు ధరలు లభించాయి. కారణం ఏదైనా భారీగా ధరలు లభించడంతో ఆనందంలో ఉన్న రైతులు ఒక్కసారిగా వేలం నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అధిక పంట ఉత్పత్తిపై కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి స్పష్టత రాకపోవడంతో బోర్డు అధికారులు అనుమతించిన మేర పంట కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాలలో వేలం నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

దక్షిణాదిలోని 11 కేంద్రాలలో ఏకంగా తొమ్మిది చోట్ల ప్రస్తుతం వేలం ఆగిపోయింది. టంగుటూరు, పొదిలిలో మాత్రమే జరుగుతోంది. అదేసమయంలో రైతుల వద్ద దాదాపు 49 మిలియన్ కిలోల పంట ఉంది. అందులో కూడా మేలురకం అధికం. ఆ రకం పొగాకుకు ఇప్పటి వరకూ మంచి ధరలు లభిస్తున్నాయి. సోమ,

మేలురకమే అధికం

మంగళవారాల్లో కిలో గరిష్ఠ ధర రూ.365 పలికింది. అలా చూస్తే రైతుల వద్ద ఉన్న పంటకు మంచి ధరలు లభించే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో అధికోత్పత్తి కొనుగోలుపై కేంద్రం స్పష్టత ఇవ్వక వేలం నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈ విషయంపై దృష్టిసారించాలని వారు కోరుతున్నారు.

భారీగా సాగు.. అదేస్థాయిలో దిగుబడి

దక్షిణాదిలో 2023-24 సీజన్‌కు88.66 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే పలు కారణాలతో భారీగా పొగాకు సాగు జరిగి ఏకంగా 139 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా. అంటే అనుమతించిన 88.66 మిలియన్ కిలోల కన్నా దాదాపు 51 మిలియన్ కిలోల మేర ఉత్పత్తి పెరిగింది. ఏకంగా 51శాతంకుపైగా ఎక్కువ ఉత్పత్తి జరగడం ఇదే ప్రథమం. కాగా గతంలో అధికోత్పత్తిలో 10శాతం మించితే అపరాధ రుసుం వసూలు చేసి కొనుగోలు చేసేవారు. అనుమతించిన పంట కొనుగోళ్లు పూర్తయ్యే లోపు దీనిపై స్పష్టత వచ్చేది. అయితే ఈ ఏడాది ఆ విషయంలో తీవ్రజాప్యం జరిగింది. కర్ణాటకలో వరుసగా రెండేళ్లు, ఆంధ్రలో గత ఏడాది అధిక ఉత్పత్తిపై అపరాధ రుసుంను రద్దుచేయగా ఈ ఏడాది కూడా అలాగే కొనుగోలు చేయాలని ఇక్కడి రైతులు పొగాకు బోర్డును కోరారు. అందుకు కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి అనుమతి కోసం బోర్డు అధికారులు లేఖ రాశారు. దానిపై కేంద్రం నుంచి దాదాపు పక్షం రోజులుగా స్పష్టత రాలేదు. ఈ లోపు దక్షిణాదిలోని పలు వేలం కేంద్రాలలో అధికారిక పంట ఉత్పత్తి కొనుగోళ్లు ముగిశాయి. దీంతో వాటిలో వేలం ఆగిపోయింది.

ఇంటర్ సర్టిఫికెట్లు సిద్ధం

ఒంగోలు (విద్య), జూలై 10 : ఈ ఏడాది పబ్లిక్, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఒరిజనల్ పాస్ సర్టిఫికెట్లు (పెద్ద మార్కుల జాబితాలు) కళాశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు ఆర్‌ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు అందరూ ఆర్‌ఐవో కార్యాలయానికి వచ్చి వీటిని తీసుకెళ్లాలని ఆయన కోరారు. విద్యార్థులకు వెంటనే పాస్ సర్టిఫికెట్లను వెంటనే పంపిణీ చేయాలని కోరారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

- మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 10 : మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో భోజనం చేస్తున్న విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ అమలు గురించి అడిగి తెలుసుకోవడంతోపాటు అక్కడ భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. మెనూ చార్ట్‌ను పబ్లిక్‌గా డిస్‌ప్లే చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న కోడిగుడ్లు, వేరుశనగ చిక్కీల రికార్డులను పరిశీలించారు. వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని ప్రధానోపాధ్యాయురాలిని హెచ్చరించారు. ఈ పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతుల నిర్మాణాలను, స్టోర్‌రూంలు, ఇతర వసతులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న కలెక్టర్ అన్సారియా

జోరుగా నీటి అక్రమ వ్యాపారం

- ట్యాంకరు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు
- కార్పొరేషన్ అధికారుల కళ్లకు గంతలు
- ఐడీఎస్ఎంటీ స్థలాల్లో అక్రమ బోర్లు



ఐడీఎస్ఎంటీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన బోరు, సంపు


ఒంగోలు (కార్పొరేషన్), జూలై 10 : ప్రజల తాగునీటి అవసరాలను కొందరు వ్యాపారంగా మార్చుకున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా అనధికార బోర్లు ఏర్పాటు చేసి దోచుకుంటున్నారు. ఒక్కో పాయింట్ ద్వారా రోజుకు పది నుంచి ముప్పై ట్యాంకర్ల వరకు అక్రమంగా నీటిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగమంతా ఏ మారుమూల ప్రాంతంలో జరుగుతుందనుకుంటే పొరపాటుపడ్డట్లే. ఒంగోలు నగరం నడిబొడ్డులో కొండను ఆసరాగా చేసుకుని సాగిస్తున్న వ్యాపారం. స్థానిక భాగ్యనగర్‌లోని డ్వామా కార్యాలయం ఎదురు ఐడీఎస్ఎంటీ స్థలాలుగా పిలవబడే ఈ ప్రాంతంలో గత కొన్ని నెలలుగా యథేచ్ఛగా నీటి వ్యాపారం సాగుతోంది.

కాసులు కురిపిస్తున్న నీటి వ్యాపారం

ఒంగోలు నగరపాలక సంస్థ యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలో కొన్ని ట్యాంకర్లు నీటిని సరఫరా చేస్తున్నాయి. అయితే ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ ట్యాంకర్లకు ప్రైవేటు నీటి సరఫరాకు అనుమతి లేదు. కానీ ప్రైవేటులో ఇష్టారాజ్యమైపోయింది. డ్రైవర్లే కీలక సూత్రధారులుగా అక్రమ నీటి వ్యాపారానికి తెరతీశారు. కొండ ప్రాంతంలో నీరు పుష్కలంగా లభిస్తుందని తెలిసిన వారు నీటి ట్యాంకరు కావాలని వారిని కోరితే ఇవి అమ్మేవి కావు, రిమ్స్ రోగుల కోసమే అని చెబుతున్నారు. నెలవారీగా కుదుర్చుకున్న హోటళ్లు, ఇతర సంస్థలకు వాటిని సరఫరా చేస్తూ తమ వ్యాపారాన్ని బహిరంగంగానే కొనసాగిస్తున్నారు.

సేవ పేరుతో దోపిడీ

కొండ వద్ద సొసైటీ పేరుతో బోర్డులు ఏర్పాటు చేసి, జోరుగా నీటి వ్యాపారం సాగుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే తాము సమాజ సేవ చేస్తున్నామని బదులిస్తున్నారు. పైసా డబ్బులు తీసుకోవడం లేదని బుకాయిస్తున్నారు. అయితే వాస్తవ పరిస్థితిని చూస్తే ఇక్కడ గత కొన్నేళ్లుగా నీటి వ్యాపారం సాగుతుండగా అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ విషయం కార్పొరేషన్ ఇంజనీర్ల దృష్టికి వెళ్లినా కనీసం చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం అధికారులకే తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా ఐడీఎస్ఎంటీ స్థలాల్లో ఏర్పాటుచేసిన అనధికార బోర్లను తొలగించి, అక్రమంగా చేస్తున్న నీటి వ్యాపారాన్ని అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సంపు నుంచి నీటిని పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన పైపులు

ప్రాజెక్టుల సీఈగా రవికుమార్

- నేడు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ ప్రాజెక్టుల విభాగం ఒంగోలు చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా కడియాల రవికుమార్ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల శాఖ పరిధిలో 27మంది వివిధస్థాయి ఇంజనీరింగ్ అధికారులకు ఉద్యోగోన్నతులతో పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటివరకూ విజయవాడలోని అంతర్రాష్ట్ర జలాల పర్యవేక్షణ విభాగంలో ఎస్ఈగా పనిచేస్తున్న రవికుమార్‌ను ఒంగోలులో ప్రాజెక్టుల సీఈగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించింది. ఇక్కడ రెగ్యులర్ సీఈగా పనిచేస్తున్న మురళీనాథ్‌రెడ్డి మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అనంతపురం సీఈగా ఉన్న శ్రీనివాసరెడ్డికి అప్పటి ప్రభుత్వం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన కూడా జూన్ 30కి ఉద్యోగ విరమణ చేశారు. ఆ ఖాళీలో ప్రస్తుతం రవికుమార్‌ను నియమించారు. కాగా రవికుమార్‌కు ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వకాలంలో జలవనరులశాఖ ఒంగోలు సర్కిల్ ఎస్ఈగా సుమారు రెండేళ్లు పనిచేశారు. సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు, నీరు-చెట్టు కార్యక్రమ పనులు ఆ సమయంలో భారీగా జరిగాయి. తాజాగా ప్రాజెక్టుల సీఈగా నియమితులైన రవికుమార్ గురువారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రాజెక్టుల సీఈ పర్యవేక్షణలో వెలిగొండ, గుండ్లకమ్మ, సంగమేశ్వర ప్రాజెక్టులతోపాటు రామతీర్థం రిజర్వాయర్ అలాగే రాష్ట్రంలోని ఎన్ఎస్‌పీ ఆయకట్టు ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో రవికుమార్ సీఈగా నియమితులు కావడం విశేషం. వెలిగొండ, గుండ్లకమ్మతోపాటు ఇతర ప్రాజెక్టుల పనులు సాగునీటి పర్యవేక్షణ మరికొంత మెరుగుపడే అవకాశం ఉంది.



రవికుమార్

అందుబాటు ధరల్లో నిత్యావసరాలు

- నేటి నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 10: అందుబాటు ధరలలో నిత్యావసర సరుకులను అన్నివర్గాల ప్రజలకు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిత్యావసర సరుకుల ధరలపై దృష్టిపెట్టారు. ప్రభుత్వ ఆదేశాలతో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ బియ్యం, పప్పుధాన్యాల మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, ఇతర అనుబంధ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మిల్లర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు బియ్యం విక్రయించేందుకు ముందుకు రావడంతో ఒంగోలులో గురువారం ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మేందుకు ఏర్పాట్లు చేశారు. లాయర్‌పేట, దిబ్బల రోడ్డు, కొత్తపట్నం బస్టాండు రోడ్డులోని రైతు బజార్లతోపాటు రామనగర్‌లో వద్ద ఉన్న డీమార్ట్ వద్ద విక్రయించేందుకు సిద్ధమయ్యారు. దేశవాళి కందిపప్పు కిలో రూ.160, నాణ్యమైన స్టీమ్ రైస్ (బీపీటీ రకం) కిలో రూ.49, రారైస్ కిలో రూ.48కి విక్రయించనున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో జిల్లాలోని అన్ని పెద్ద మార్కెట్‌లలో కూడా ఈ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.



డాక్టర్ నామినేనికి అభినందనలు



కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 10 : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్), డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్‌ను టీడీపీ నాయకులు అభినందించారు. బుధవారం ఒంగోలులోని జీజీహెచ్‌లో ఆయనను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో 30వ డివిజన్ అధ్యక్షులు నత్తల కనకారావు, 12వ డివిజన్ అధ్యక్షులు గంగవరపు సందీప్‌కుమార్, నాయకులు జీ.రాజ్‌విమల్, రమేష్, కొమ్ము సురేష్, కంకణాల భాను, ఎస్.ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను మార్చే విధానాలను ఉపసంహరించుకోవాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 10: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చే విధానాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బుధవారం డిమాండ్స్ డే నిరసన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నేటికి కనీస వేతనం అమలు కావడం లేదని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారంలోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణను ఆపాలని, నూతన పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నాయకుడు జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు రాంబాబు, మహేష్, జి.రమేష్, దామా శ్రీనివాసులు, దాసరి రమేష్, తంబి శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, రత్నకుమారి, టి.విజయ, బి.దివ్య వంశీ, ప్రశాంతకుమారి, కృష్ణమోహన్, సురేంద్ర, బీవీ.రావు, కొండలు, ఏవీ.పుల్లారావు, శేషయ్య, నరసయ్య, పీవీఆర్.సుబ్బారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పీజీ ఫలితాల్లో శ్రీహర్షిణి ఫస్ట్



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులు

ఒంగోలు(విద్య), జూలై 10: ఆంధ్రకేసరి యూనివర్శిటీ పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి తమ సత్తా చాటారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో 70మందికి 64 మంది పాసయ్యారు. కటారి యామిని 700లకు 634 మార్కులు సాధించి యూనివర్శిటీ టాపర్‌గా నిలిచారు. వి.హర్షిత 620, కె.గౌతమి 621 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగే ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 56మందికి 50మంది పాసయ్యారు. చెరుకూరి మహిత 650కి 566 మార్కులు సాధించి యూనివర్శిటీ టాపర్‌గా నిలిచారు. జి.భావన 552, కె.హేమ 546 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. ఇక ఎమ్మెస్సీ మేథమెటిక్స్‌లో 38మంది పరీక్షకు హాజరు కాగా 30మంది ఉత్తీర్ణులయ్యారు. గుండ్రెడ్డి స్వప్న 600లకు 483 మార్కులు సాధించగా, జి.పుష్పలత 480, టి.సంపత్‌కుమార్ 472 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో యూనివర్శిటీ స్థాయిలో కేవలం ముగ్గురు మాత్రమే ఉత్తీర్ణులు కాగా వీరిలో శ్రీహర్షిణి విద్యార్థులు ఇద్దరు ఉండటం విశేషం. పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం స్థానిక కళాశాలలో చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.కవిత, ప్రిన్సిపాల్ డి.ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

టీచర్ల బోధన మెరుగుకే టీచ్‌టూల్



సర్టిఫికెట్‌లను అందజేస్తున్న డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), జూలై 10 : తరగతి గదిలో ఉపాధ్యాయుల తమ బోధనను మెరుగు పర్చుకునేందుకు టీచ్ టూల్ కార్యక్రమం దోహదపడుతుందని డీఈవో సుభద్ర తెలిపారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ తరగతి వాతావరణం, బోధన పద్ధతులు, సామాజిక భావోద్వేగాల క్షణాలను పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. శిక్షణ పొందిన టీచర్లు తోటి ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి టీచ్‌యాప్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఎంఈవో కిషోర్‌బాబు, ఏఎంవో ఎం.రమేష్, జిల్లా కో ఆర్డినేటర్ కిషన్‌నాయక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న టీచర్లకు డీఈవో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఫిషింగ్‌హార్బర్ ఏర్పాటుకు స్థల పరిశీలన



భూముల వివరాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జూలై 10: మండలంలోని తీరంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు కోసం బుధవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్‌ను మంజూరు చేసింది. తొలుత ఫిషింగ్ హార్బర్‌ను కొత్తపట్నం తీరంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాంతంలో ఏర్పాటుకు ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరిపింది. అయితే మత్స్యకారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో మండలంలోని రంగాయపాలెం, పిన్నివారిపాలెం గ్రామాల తీరంలో ఈ ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తీరంలోని ఈ స్థలాన్ని జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ స్థలాల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొత్తపట్నం తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు విరివిగా రుణాలు ఇవ్వాలి

● కలెక్టర్ అన్సారియా



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 10: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలకు తగినట్లుగా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో బుధవారం జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమ్మిళిత ఆర్థిక వృద్ధితోనే జిల్లా సమగ్రాభివృద్ధికి సాధ్యమవుతుందన్నారు. అందువల్ల బ్యాంకులు కూడా ఈ దిశగా అన్ని రంగాలకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. విద్యారుణాలతో పాటు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న పథకాలతో సంబంధం ఉన్న వాటికి సత్వరమే రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళికను త్వరగా ఖరారు చేయాలని, ఇందులో సాంకేతిక సమస్యలు వస్తే ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులను సమన్వయం చేసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. అంతకుముందు ఎల్‌డీఏ డి.రమేష్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో రుణాలు పంపిణీ లక్ష్యం రూ.17,988 కోట్లు కాగా 172.19శాతంతో రూ.30,975 కోట్లు అందించామన్నారు. ప్రాధాన్యత రంగాలకు 143.41శాతం, ప్రాధాన్యేతర రంగాలకు 385.33శాతం రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ అధికారి నాగప్రవీణ్, నాబార్డు డీడీఎం రవికుమార్, పీడీసీసీ బ్యాంకు సీఈవో కోటిరెడ్డి, వివిధ శాఖల అధికారులు వసుంధర, రవికుమార్, శ్రీనివాసరావు, గోపీచంద్, పీవీ.రమణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయ్ కుమార్, శ్రీనివాసరావు, రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ ప్రబలకుండా చర్యలు

జిల్లాలో డెంగ్యూ కేసులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం డెంగ్యూ నివారణ మాసోత్సవంపై సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పనిచేస్తున్న ఏఎన్ఎంలందరూ విధిగా వారికి కేటాయించిన గృహాలను సందర్శించి జ్వరంతో బాధపడుతున్న వివరాలను నమోదు చేయాలన్నారు. ఎక్కడైనా డెంగ్యూ కేసు నమోదు అయినట్లు గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి చుట్టూ పక్కల గృహాలలో వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది అందరూ డెంగ్యూ హాట్ స్పాట్‌లను గుర్తించి వెంటనే ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ శాఖల సమన్వయంతో సకాలంలో రక్త పరీక్ష నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతరం జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం పోస్టర్లను కలెక్టర్ అన్సారియా ఆవిష్కరించారు. ఈనెల 18నుంచి వచ్చేనెల 2వతేదీ వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారి సురేష్ కుమార్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి

● డీఆర్‌డీఏ పీడీ వసుంధర



మాట్లాడుతున్న పీడీ వసుంధర

ఒంగోలు నగరం, జూలై 10: పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాల రకవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి.వసుంధర పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల బకాయిలు పేరుకుపోతున్న దృష్ట్యా ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని వసూలు చేయాలన్నారు. ఆర్థిక అవకతవకలకు పాల్పడిన వారు ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఉన్నతి రుణాలను సక్రమంగా వినియోగించుకున్నారా అనే దిశగా పరిశీలన జరపాలని ఆదేశించారు. వడ్డీలేని రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించేలా వారిని చైతన్యవంతం చేయాలని కోరారు. కమ్యూనిటీ ఇన్వెస్టుమెంటు రుణాలను వంద శాతం తిరిగి చెల్లించేలా చూడాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహించి అందులో వచ్చిన రిమార్కులను ఎప్పటికప్పుడు సరి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్సూరెన్సు పథకాలను, పెళ్లి కానుక పథకాలపై మహిళా సంఘాలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇక నుంచి ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీలోగా ప్రతి మహిళా సంఘం సమావేశం నిర్వహించాలని, 16 నుంచి 23వ తేదీ వరకు ప్రతి గ్రామ సంఘం, 23 నుంచి 30వ తేదీ మధ్య అన్ని మండల సమాఖ్యల సమావేశాలు జరగాలని స్పష్టం చేశారు. పొదుపు సంఘాల మహిళలకు పీఎంఈజీపీ, ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రయిజెస్, సీడ్ కాపిటల్ కార్యక్రమాలను అవగాహన కల్పించి వాటిని విజయవంతంగా ముందుకు తీసుకుపోవాలని పీడీ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

శ్రీకర డెవలపర్స్ విల్లాస్ అవినీతిమయం

మాజీ మంత్రి బాలినేనిపై టీడీపీ నేత సుబ్బారావుగుప్తా ధ్వజం



మ్యాపును చూపిస్తూ మాట్లాడుతున్న సుబ్బారావుగుప్తా

ఒంగోలు(క్రైం), జూలై 10: ఒంగోలు నగరం వెంగముక్కపాలెంలోని శ్రీకర డెవలపర్స్ విల్లాస్ నిర్మాణంలలో అవినీతి బాగోతం దాగివుందని తెలుగుదేశం పార్టీ ఆర్యవైశ్య నాయకుడు సుబ్బారావు గుప్తా ఆరోపించారు. బుధవారం నగరంలోని గుప్తాస్ మిడ్‌టౌన్‌లోని ట్రిపుల్‌ఆర్ లెనిన్ షాపులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. శ్రీకర్ డెవలపర్స్ పేరుతో 40 ఎకరాల్లో విల్లాస్ నిర్మించారని చెప్పారు. మాజీ మంత్రి బాలినేని అండతో ఆయన వియ్యంకుడు అక్కడ నల్లవాగు పూర్తిగా పూడ్చి వేయడం వల్ల వెంగముక్కపాలెం గ్రామం వరద నీటిలో ప్రమాదం ఉందని విమర్శించారు. అదేవిధంగా శ్రీకర డెవలపర్స్ పేరుతో కొనుగోలు చేసిన 15 ఎకరాలలో అనేక అవినీతి జరిగిందన్నారు. అంతేకాకుండా 40 ఎకరాల విల్లాస్ నిర్మాణం జరిగిన ప్రాంతానికి యరజర్ల కొండ నుంచి గ్రావెల్ అక్రమంగా తవ్వకాలు చేసి చదును చేశారని ఆరోపించారు. అందుకు మైనింగ్ అధికారుల అండ ఉందని తెలిపారు. అలాగే విల్లాస్‌లో 36 సెంట్లు కుంటపోరంబోకు ఉందని, నైరుతి భాగంలో ఉన్న పంట కాలువను కూడా కబ్జా చేశారని వివరించారు. నిబంధనలు తుంగలో తొక్కి కార్పొరేషన్ అధికారులు సైతం వంతపాడారని వివరించారు. విల్లాస్ నిర్మాణంలో జరిగిన అవినీతిపై అక్కడే ఆందోళనకు దిగనున్నట్లు సుబ్బారావు గుప్తా తెలిపారు. అదేవిధంగా శ్రీకర డెవలపర్స్‌పై ఉన్నతాధికారులతో పాటు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన పేర్కొన్నారు.

భూసేకరణను వేగవంతం చేయాలి

● కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

మర్రిపూడి, జూలై 10: బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్ ఆదేశించారు. భూ వివాదాలను సత్వరమే పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. మర్రిపూడి మండల పరిషత్ సమావేశం హాలులో బుధవారం రైతులు, రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. రైతుల సమస్యల కారణంగా రహదారి పనులకు అవాంతరాలు ఏర్పడటానికి వీలులేదన్నారు. మండలంలోని పన్నూరు, మర్రిపూడి, కూచిపూడి, తిప్పలదేవిపల్లె, గార్లపేట గ్రామాలకు చెందిన 66 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించి భూసేకరణ చేయాల్సింది ఉందని ఈసందర్భంగా ఆయన వివరించారు. రెండు, మూడు రోజుల్లో రైతులు తామంతట తాము వివాదాలు పరిష్కరించుకుని నష్టపరిహారం తీసుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్న ఆయన.. పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్, తహసీల్దార్ కె.బి.టి.సుందరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ కేఆర్ భూపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కమ్మ వారి ఆత్మీయ సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న సమితి నాయకులు, ప్రతినిధులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 10: కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో కమ్మవారి ఆత్మీయ సమావేశం బుధవారం మండువవారిపాలెంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్నటువంటి కాకతీయ సేవా సమితి వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమితి, కుటుంబసభ్యులు పాల్గొని పరస్పర యోగక్షేమాలు తెలుసుకున్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. త్వరలోనే జిల్లా కమిటీ ఎన్నిక, సంఘం బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అదేవిధంగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, అలాగే విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం, కళ్యాణ మండపం నిర్మించాలని సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాగబోయిన భాస్కర్‌రావు, సంఘ కార్యదర్శి కాట్రగడ్డ రఘు, సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, వృద్ధాశ్రమం అధ్యక్షులు తేళ్ళపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీమన్నారాయణ, ఆసరా వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకురాలు రావుల పద్మజ, ఆర్ల వెంకటరత్నం, సిటిజన్ సుబ్బారావు, అంజలి శ్రీనివాస్, మారెళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జల్‌శక్తి అభియాన్ డైరెక్టర్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న డైరెక్టర్ దివిదత్తు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 10: కలెక్టర్ తమీమ్ అన్సారియాను జల్‌శక్తి అభియాన్ డైరెక్టర్ దివి దత్తు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఒంగోలు వచ్చిన ఆయన ముందుగా జలశక్తి అభియాన్‌పై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 2024 సంవత్సరంలో జిల్లాలో జరిగిన వివిధ రకాల నీటినిల్వ, సంరక్షణకు సంబంధించిన పనులపై సమీక్షించారు. అలాగే జల్‌శక్తి అభియాన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు అనంతరం జిల్లాలో జరిగిన పనుల ఫొటోల ఎగ్జిబిషన్‌ను తిలకించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అధికారులు అర్జున్‌రావు, ఉషారాణి, వెంకటేశ్వర్లు, మర్దన్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(విద్య), జూలై 10: సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగులు జీతం కోసం బుధవారం మధ్యాహ్నభోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఉద్యోగుల మే, జూన్ మాసాల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, సమ్మె కాలపు జీతం చెల్లించాలని, సమ్మె అగ్రిమెంట్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలని ప్లేకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అన్ని విభాగాల ఉద్యోగులకు మినిమం టైం స్కేలు అమలుకు చర్యలు తీసుకోవాలని, మెగా డీఎస్సీలో అర్హులైన ఎస్ఎస్ఏ ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు సమగ్ర శిక్ష ఉద్యోగులకు అమలు చేయాలని కోరారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ నాయత్వంలో ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు

శ్రీరామ్ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు వంశీకృష్ణ, శాంతకుమారి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 10: ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలోనూ, పేదలకు రాయితీపై వైద్యం అందించడంతోపాటు, ప్రతి నెల మొదటి గురువారం ఎంతో వ్యయంతో కూడిన ఎముక పటుత్వ పరీక్ష ఉచితంగా చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆధునిక వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులు నందలూరి సరయు, పొక్కినగారి ఏడుకొండలు, సౌమిత్ర పల్లవ్, చంద్రమౌళితోపాటు సిబ్బంది రక్తదానం చేశారు.

నేటి నుంచి రంగభూమి సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు(కల్చరల్), జూలై 10: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంఘం కోశాధికారి దేనువకొండ వెంకట సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా గురువారం జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు నాలోన నీవే, చీకట్లో చిందులాట నాటికల ప్రదర్శన, 13న సాయంత్రం 6 గంటల నుంచి సంఘ వార్షికోత్సవం జరుగుతాయాన్నారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్ అన్సారియాకు బొకే ఇస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 10: కలెక్టర్ తమీమ్ అన్సారియాను బీజేపీ నాయకులు స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్‌కుమార్, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ సీతారామయ్యలు కలెక్టర్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరంలో తాగునీటి సమస్యతో పాటు వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కుల దూషణపై సర్పంచ్ ఫిర్యాదు

నాగులుప్పలపాడు, జూలై 10: పంచాయతీ కార్యదర్శి తనను కులం పేరుతో దూషించారని ఉప్పుగుండూరు గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ అయిన తనను అదే పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న హరిబాబు కులం పేరుతో దూషించారని, అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బుధవారం సీఐ అజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

మహిళా కానిస్టేబుల్ హల్‌చల్

● సస్పెండ్ చేయాలని మాలమహానాడు డిమాండ్

ఒంగోలు(క్రైం), జూలై10: బాధితులకు భరోసా కల్పించాల్సిన మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళా కానిస్టేబుల్ హల్‌చల్ చేశారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆమెను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఒంగోలుకు చెందిన కొలసలకోట శ్రీనివాసరావు, అతని భార్య మధ్య ఉన్న వివాదానికి సంబంధించిన కేసు విచారణకు స్టేషన్‌కు వెళ్లిన వారి పట్ల మహిళా కానిస్టేబుల్ అరుణ వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. పారదర్శకంగా వ్యవహరించాల్సిన పోలీసులు బాధితులపై వివక్ష చూపడం విచారకరమని, మహిళా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది తీరుపై విచారణ జరపాలని అంజయ్య డిమాండ్ చేశారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న శివకుమారి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 10 : మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ సైకం శివకుమారి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని రెవెన్యూభవన్‌లో జరిగిన జేఏసీ అమరావతి మహిళా విభాగం సమావేశంలో ఆమె ముఖ్యఅతిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో జేఏసీ అన్నిశాఖలను పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యత్వ నమోదుతో పాటు త్వరలో జరగనున్న మెగా మెడికల్ క్యాంపు కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా చైర్‌పర్సన్ ఎన్.జయలక్ష్మి, జనరల్ సెక్రటరీ సీహెచ్.శ్రీదేవి, ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్.కృష్ణమోహన్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసులు, జిల్లా సెక్రటరీ కందుల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, జూలై 10: అంగన్‌వాడీ, భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన పథకంతో పాటు పలు రంగాల్లోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ చార్జీలు పెంచాలని, ఉచిత గ్యాస్, యూనిఫాం, గుర్తింపు కార్డులు అందజేసి వేతనాలు పెంచలన్నారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నుంచి ప్రభుత్వం తీసుకున్న నిధులు తిరిగి జమచేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.బసవపున్నయ్య, ఎన్.రామారావు, కళ్యాణి, రజని, రమణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అనధికారికంగా బ్యారన్ నిర్మాణం నేరం : ఆర్ఎం

టంగుటూరు, జూలై 10 : అనధికారికంగా బ్యారన్ నిర్మాణం చట్టరీత్యా నేరమని పొగాకు బోర్డు ఆర్ఎం ఎం.లక్ష్మణరావు, వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పొగాకు మార్కెట్లో రైతులకు లభిస్తున్న ధరలను చూసి కొందరు వచ్చే సీజన్‌లో పంట సాగుకు ఉత్సాహపడుతున్నారన్నారు. అందుకోసం అనుమతి లేకుండానే బ్యారన్లు నిర్మిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాగే అత్యధిక కౌలుకు పొలాలు, బ్యారన్లు తీసుకుంటున్నారని తెలిపారు. వచ్చే సీజన్‌లో పొగాకుకు ప్రస్తుతం ఉన్న డిమాండ్ ఉంటుందన్న గ్యారెంటీ లేదని, తేడాలొస్తే తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. బోర్డు అనుమతి లేకుండా పొగాకు బ్యారన్లు నిర్మించవద్దని సూచించారు.

కేంద్ర జల్‌శక్తి బృందం పర్యటన

రెండు మండలాల్లో పనుల పరిశీలన



వెన్నూరులో డ్రాగన్‌ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కొండపి, జూలై 10 : నియోజకవర్గంలోని కొండపి, జరుగుమల్లి మండలాల్లో కేంద్ర జల్‌శక్తి బృందం బుధవారం పర్యటించింది. వెన్నూరు గ్రామానికి చెందిన రైతు కొండ్రు లక్ష్మీనారాయణ అర ఎకరాలో సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను, జలజీవన్ మిషన్‌లో భాగంగా అదేగ్రామంలో ఇంటింటికీ వేసిన కొళాయిలను పరిశీలించింది. కార్యక్రమంలో జల్‌శక్తి అభియాన్ బృంద సభ్యుడు దేవదత్తు సేతుపతి, శాస్త్రవేత్త సంతోష్ గౌతమ్, డ్వామా పీడీ అర్జున్‌రావు, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో నాగమణి, ఉపాధి హామీ పథకం ఏపీవో మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపాలెంలో...

జరుగుమల్లి మండలం చింతలపాలెంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో నిర్మించిన అమృత సరోవర్ ట్యాంక్ (చెరువు)ను, ఇంటింటికీ వేసిన మంచినీటి కొళాయిలను కేంద్ర జల్‌శక్తి అభియాన్ బృందం సభ్యుడు దేవదత్తు సేతుపతి ఆధ్వర్యంలోని బృందం బుధవారం పరిశీలించింది. కార్యక్రమంలో డ్వామా పీడీతోపాటు ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో జలజాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఈవోఆర్డీ అంజలీదేవి, ఏపీవో నాగరాజు, గ్రామ సర్పంచ్ హరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు మల్లీశ్వరి, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో డీఎల్‌పీవో విచారణ

అవకతవకలపై ప్రశ్నించిన టీడీపీ కూటమి నాయకులు



డీఎల్‌పీవో పద్మావతితో మాట్లాడుతున్న కూటమి నాయకులు

నాగులుప్పలపాడు, జూలై 10: ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలో బుధవారం డీఎల్‌పీవో పద్మావతి విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి హరిబాబు గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులకు సంతకాలు చేయకుండా కాలయాపన చేస్తూ అదేమని అడిగిన తనను కులం పేరుతో దూషించారని సర్పంచ్ దేవరకొండ జయమ్మ ఒంగోలులోని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

నిధుల స్వాహాపై..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ నిధులు స్వాహా చేసిన వారిపై 8 నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడంతో టీడీపీ కూటమి నాయకులు, వార్డు మెంబర్లు డీఎల్‌పీవో పద్మావతిని ప్రశ్నించారు. పంచాయతీలో రూ.43లక్షలు అవినీతి జరిగినట్లు విచారణాధికారిగా గుర్తించారని, ఆ నివేదికను అప్పటి డీపీవోకు అందించినట్లు డీఎల్‌పీవో వారికి వివరించారు. బాధ్యులపై చర్యలు ఉన్నతాధికారుల పరిధిలో ఉన్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో కనగాల శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్, బి.సెల్వం, బెల్లం వెంకటేశ్వర్లు, పెంట్యాల కోటేశ్వరరావు, పెంట్యాల శ్రీనివాసరావు, ఎన్.వెంకట్, బెల్లం శ్రీను, లచ్చంశెట్టి టేగ్రా, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రెండేళ్ల క్రితం కొన్నామంటూ దేవదాయ భూముల కబ్జా



దేవదాయ భూములను చదును చేసిన ఆక్రమణదారులు

పామూరు, జూలై 10 : పామూరులోని విరువూరు రోడ్‌లో శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూములను రెండేళ్ల క్రితమే కొన్నామంటూ వాటిని ఆక్రమించేందుకు కొందరు రంగం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా భూములను చదును చేసి వెంచర్ వేసేందుకు పావులు కదుపుతున్నారు. ఎండోమెంట్‌కు చెందిన సర్వేనెంబర్ 256/3 లో 29.33 ఎకరాల భూమి ఉంది. ఆ భూములను ఆక్రమించుకొని పదేళ్ల క్రితంపైనే కొందరు రేకుల షెడ్డులు నిర్మించారు. ఆ తర్వాత కాలంలో ఆ నిర్మాణాలను వారు అమ్మేశారు. అంతేగాక ఆ పక్కనే ఉన్న దేవదాయ భూములను కలిపి విక్రయించారు. తాజాగా కొందరు ఖాళీగా ఉన్న దేవదాయ భూమిలో వెంచర్లు వేసేందుకు చుట్టూ ఫెన్సింగ్ వేశారు. బుధవారం విషయం తెలుసుకొన్న ఎండోమెంట్ ఈవో నరసింహబాబు దేవస్థాన కమిటీ సభ్యులతో కలిసి జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకున్నారు. ఆక్రమణదారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎండోమెంట్ భూములను ఆక్రమించుకుంటే పోలీస్ కేసులు నమోదు చేయిస్తామని ఈవో హెచ్చరించారు.

దర్శి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి

- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న లక్ష్మి

దర్శి, జూలై 10 : దర్శి పట్టణంలో మౌలిక వసతులు పెంపొందించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో రూ.14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు బుధవారం సాయంత్రం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను కొద్దిరోజుల క్రితం కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, కౌన్సిలర్ వై సరస్వతి, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, ఐ టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి సందు రామయ్య, నాయకులు నక్కా బాలరంగా పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం

ఆంధ్రజ్యోతి కథనాలతో కదిలిన ఆర్డీవో, కమిషనర్

అక్రమ కట్టడాలను తొలగించి, బిల్డింగులను ప్రభుత్వపరం చేసిన అధికారులు

కనిగిరి, జూలై 10: కనిగిరి ప్రాంతంలో ఇష్టారాజ్యంగా సాగిన ఆక్రమణలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన వరుస కథనాలతో అధికారుల కదిలారు. ఆర్డీవో జాన్‌ఇర్విన్, కమిషనర్ టీవీ రంగారావు ఆక్రమణలపై, ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతూ ఆక్రమణలు తొలగించి వేస్తున్నారు. ఇప్పటికే కనిగిరి-ఒంగోలు రోడ్డులో, కనిగిరి-పామూరు రోడ్డులో గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు అక్రమంగా వేసిన వెంచర్లపై, ప్రభుత్వ భూములు ఆక్రమణలను తొలగించారు. ఇంకా అక్రమంగా వేసిన వెంచర్లు, వాగు, పోరంబోకు, పశువుల బీడు భూములు ఆక్రమణలపై జుళిపిస్తున్నారు... జల్లెడ పడుతున్నారు. ఇంకో పక్క ప్రభుత్వ స్థలాల్లో ఉన్న బిల్డింగులను స్వాధీనం చేసుకున్నారు. వాటిల్లో ఇటీవల పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీ 11వ వార్డు పరిధిలోని హైవే రోడ్డు వెంట ఉన్న ఆక్రమణలను తొలగించటంతో పాటు ఆయా స్థలాల్లో ఉన్న బిల్డింగులను స్వాధీనం చేసుకుని కనిగిరి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి ఓ బిల్డింగును విద్యుత్ శాఖ కార్యాలయానికి వినియోగించేందుకు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆక్రమణదారుల్లో గుబులు మొదలైంది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఈఈ

- కొప్పెరపాడు సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ తొలగింపు

బల్లికురవ, జూలై 10 : విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మార్టూరు సబ్ డివిజన్ విద్యుత్ శాఖ డీఈఈ ఎం.సురేంద్రబాబు హెచ్చరించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో సబ్ స్టేషనా.. మద్యం దుకాణమా అనే కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. డీఈఈ సురేంద్రబాబు కొప్పెరపాడు సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి సోమవారం రాత్రి మద్యం పార్టీ జరిగిన విషయమై సిబ్బందిని విచారించారు. ఎవరైనా డ్యూటీ సమయంలో మద్యం సేవించి విధులకు హాజరైతే వెంటనే వారిపై కేసులు నమోదు చేసి విధుల నుంచి తప్పిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా విద్యుత్ సమస్యపై ఫోను చేస్తే వారికి సరైన సమాధానం చెప్పాలన్నారు. ఈ విచారణలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా సబ్‌స్టేషన్‌లో మద్యం పార్టీ జరిగిన సమయంలో సోమవారం రాత్రి విధులలలో ఉన్న షిఫ్ట్ ఆపరేటర్ ఖాజావలిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఈఈ సురేంద్రబాబు తెలిపారు. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనం మేరకు విచారణ జరిపామని చెప్పారు. ముందస్తుగా డ్యూటీలో ఉన్న వారిని బాధ్యులను చేస్తూ షిఫ్ట్ ఆపరేటర్‌ను తొలగిస్తున్నట్లు అయన తెలిపారు. ఈ ఘటనపై ఒంగోలు ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జునరావు విచారణ జరిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. పార్టీ జరిగిన సమయంలో పలు గ్రామాలకు చెందిన విద్యుత్ సిబ్బంది కూడా ఉన్నారని దానిపై కూడా విచారణ జరిపాలని పలువురు కోరుతున్నారు.

విచ్చలవిడిగా పురుగు మందులు వాడొద్దు



మాట్లాడుతున్న శైలజారాణి

టంగుటూరు, జూలై 10 : ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వాడొద్దని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎ.శైలజారాణి రైతులకు సూచించారు. మండలంలోని జమ్ములపాలెంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందులు సిఫార్సుల మేరకే వినియోగించాలన్నారు. సేంద్రియ, జీవన ఎరువులు, వేప కషాయం, వేప నూనె లాంటి ప్రకృతి వనరులును వినియోగించడంతోపాటు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవాలన్నారు. భూసార పరీక్షా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సుచరిత మట్టి నమూనా తీసే విధానం, మట్టి పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయాధికారులు వి.వెంకటశేషమ్మ, వీఏఏ ప్రావీణ్య, రైతులు పాల్గొన్నారు.

మహిళా మార్టును సందర్శించిన సెర్ప్ ఏడీ



సభ్యులతో మాట్లాడుతున్న మహిత

టంగుటూరు, జూలై 10 : సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత బుధవారం టంగుటూరులోని మహిళా మార్టును సందర్శించారు. అక్కడ కొనుగోళ్లు, వ్యాపార లావాదేవీలు, రికార్డులు, సభ్యుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మహితను తెలుగు మహిళలు, మహిళా మార్టు సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. ఆమె వెంట వెలుగు ఏసీ రాంబాబు, ఏపీఎం రవి, సీసీలు, తెలుగు మహిళ నాయకురాలు తోకల భారతి ఉన్నారు.

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కొండపి, జూలై 10 : జీతాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా ప్రభుత్వం వెంటనే మార్చాలని కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం కొండపిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, నిర్మలతోపాటు కేజీ మస్తాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

హత్యకేసులో నిందితురాలి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ రంగనాథ్, ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ, జూలై 10: సింగరాయకొండ జాతీయ రహదారి సమీపంలో కొద్దిరోజుల క్రితం జరిగిన యువకుడి హత్య కేసులో ప్రధాన నిందితురాలిని పోలీసులు అరెస్టు చేశారు. వివాహేతర సంబంధమే కారణమని తేల్చారు. వివరాలను సీఐ రంగనాథ్ ఎస్ఐ టి.శ్రీరాంతో కలిసి బుధవారం వెల్లడించారు. బాపట్ల జిల్లా అమర్తలూరుకు చెందిన దేవరకొండ గోపి (35) ఈనెల 6వతేదీ రాత్రి జాతీయ రహదారిపై ఉన్న ఏఎస్‌ఆర్ హోటల్ పక్కన హత్యకు గురయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తెనాలి మఠంబజారుకు చెందిన మొగిలి లక్ష్మి, మరో నిందితుడు బుస్సా నాగరాజు కలిసి గోపిని హత్య చేసినట్లు తేలింది. దీంతో లక్ష్మిని బుధవారం అరెస్టు చేశారు. నాగరాజు కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పొన్నలూరు (కొండపి), జూలై 10 : డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పొన్నలూరులో బుధవారం వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రవికిరణ్ వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్ కృష్ణచైతన్య, సబ్ యూనిట్ అధికారి భాస్కర్, సూపర్‌వైజర్లు సురేష్, శ్రీనివాసరావు, జ్యోతి, సుజాత, ఏఎన్‌ఎం హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

భవానీనగర్‌లో బోరు ఎక్కడ వేశారు ?

ప్రశ్నించిన ఎంపీటీసీ సభ్యుడు ఎల్లయ్య

నీళ్లు నమిలిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం

ఎర్రగొండపాలెం, జూలై 10 : ఎర్రగొండపాలెం పంచాయతీ భవానీనగర్‌లో మండలపరిషత్ నిధులతో బోరువేసినట్లు చూపుతున్నారని ఆబోరు ఎక్కడ ఉందో చూపాలని ఎంపీటీసీ సభ్యుడు గుమ్మా ఎల్లయ్య ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను ప్రశ్నించారు. ఎర్రగొండపాలెం మండల పరిషత్ సమావేశం బుధవారం ఎంపీపీ డి. కిరణ్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలు అంశాలపై టీడీపీ, వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచుల మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది. వైసీపీకి చెందిన మిల్లంపల్లి సర్పంచి ఏకుల జయమ్మ, మొగుళ్ళపల్లి సర్పంచి వెంకటేశ్వర్‌రెడ్డి, గంజివారిపల్లె సర్పంచి డి. సుబ్బారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మందుల శేషు మాట్లాడుతూ సర్పంచుల తీర్మానం లేకుండా టీడీపీవారికి నీటిసరఫరా ఎలా అప్పగించారని ఏఈని ప్రశ్నించారు. తీర్మానం లేకుండా నీటి సరఫరా చేస్తుంటే బిల్లులు ఎలా వస్తాయని వారు ప్రశ్నించారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాల్లో అత్యవసరం కింద రవాణా చేస్తున్నారని ఏఈ వెల్లడించారు. ఎర్రగొండపాలెం 2 ఎంపీటీసీ సభ్యులు గుమ్మా ఎల్లయ్య మాట్లాడుతూ 3 సంవత్సరాల క్రితం మండల పరిషత్ నిధులు రూ. 2 లక్షలతో భవానీనగర్‌కు బోరు మంజూరు అయ్యిందని, ఆ బోరు ఎక్కడ నిర్మించారో చెపాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను ప్రశ్నించారు. దీంతో ఆయన సమాధానం చెప్పలేక తడబాటుకుగురయ్యారు. బోరు వేశాం కనెక్షన్ ఇవ్వలేదని చెప్పగా, ఆ బోరు ఎక్కడుందో చూపించాలని కోరారు. మండల ఉపాధ్యక్షులు శేషు మాట్లాడుతూ బోయలపల్లిలో 3 సంవత్సరాల క్రితం బోరు వేస్తే టీడీపీ సర్పంచి తీర్మానం ఇవ్వలేదని చెప్పడంతో బోయలపల్లి సర్పంచి పాలడుగు వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొని వైసీపీ నాయకుడి వామిదొడ్డిలో బోరు వేస్తే తీర్మానం ఎలా ఇస్తామని అనడంతో టీడీపీ, వైసీపీ సర్పంచులు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీనితో పక్కనే ఉన్న పోలీసులు సమావేశం వద్దకు రావడంతో వివాదం సర్దుమణిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో అధికార పార్టీ నాయకులు ఒత్తిడితో కుకింగ్ ఏజెన్సీలను తొలగిస్తున్నారని, స్కూలు యాజమాన్యకమిటీ తీర్మానం లేకుండా ఎలా తీసివేస్తారని వైసీపీ సర్పంచులు ఎంఈవో మల్లికార్జున నాయక్‌ను ప్రశ్నించారు. కుకింగ్ ఏజెన్సీల కాలపరిమితి అయిపోతున్నందున తీసివేస్తున్నామని సమాధానం చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో నాగేశ్వర ప్రసాదు, తహసీల్దారు సోమ్లానాయక్, జడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల లెవెల్ అధికారులు పాల్గొన్నారు.



భవానీనగర్‌లో బోరు ఎక్కడ నిర్మించారో తెలపాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు గుమ్మా ఎల్లయ్య



కార్యాలయం బయట బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



మండల పరిషత్ సమావేశంలో టీడీపీ, వైసీపీ ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వివాదం

కార్యాలయం వద్ద భారీ బందోబస్తు

ఎర్రగొండపాలెం సీఐ రాములు నాయక్ పర్యవేక్షణలో 36 మంది పోలీసు కానిస్టేబుళ్లు, ఆరుగురు ఎస్‌ఐలు, మండల పరిషత్ సమావేశం భవనం ముంగిట పహారా కాశారు. మండల పరిషత్ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వస్తున్నారని, సమావేశంలో గొడవలు జరుగుతాయని ముందు జాగ్రత్తగా పోలీసు అధికారులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు ఎమ్మెల్యే రావడంలేదని సమాచారం అందడంతో పోలీసులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

రోడ్లకు నిధులు ఇవ్వండి

- మంత్రి జనార్దన్‌రెడ్డికి ఎరిక్షన్‌బాబు వినతి

ఎర్రగొండపాలెం, జూలై 10 : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని బుధవారం అమరావతిలో ఆశాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గం నుంచి మండల కేంద్రాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎర్రగొండపాలెం త్రిపురాంతకం ఆర్‌అండ్‌బీ, ఎర్రగొండపాలెం పుల్లలచెరువు రోడ్లను డబుల్‌రోడ్లుగా నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్రిపురాంతకేశ్వరస్వామి కొండ సమీపంలో నాగార్జునసాగర్ కాల్వపై రెండవ బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని అర్జీలో కోరారు. నిధులు రాగానే మంజూరు చేస్తానని సానుకూలంగా మంత్రి స్పందించారని ఎరిక్షన్‌బాబు తెలిపారు.



మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎరిక్షన్‌బాబు

సాయిబాబాది జ్ఞానమార్గం



ఆధ్యాత్మిక వేత్త అక్బర్ శాస్త్రిని సన్మానిస్తున్న మందిర కమిటీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 10: శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో బోధించిన విధంగా భగవంతుడు సర్వాంతర్యామి అని శ్రీకాళహస్తికి చెందిన ఆధ్యాత్మిక వేత్త మొఘల్ సాయి అక్బర్ శాస్త్రి అన్నారు. స్థానిక షిర్డి సాయి మందిరంలో గురు పౌర్ణమి ఉత్సవాలు పురస్కరించుకుని సప్తహా ప్రవచనాలలో భాగంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. సాయిబాబాది జ్ఞాన మార్గం అన్నారు. అనంతరం మందిర కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

జేవీవీ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు

జేవీవీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నాయకులు వై.రవికుమార్ బుధవారం తెలిపారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక రెడ్డి మహిళా జూనియర్ కళాశాలలో పర్యావరణ కాలుష్యంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కౌలుకార్డులపై అవగాహన

పొదిలి, జూలై 10 : కౌలు రైతులకు కార్డుల జారీపై సంబంధిత అధికారులకు అవగాహన కార్యక్రమం తహసీల్దార్ మహ్మద్‌జియా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి కౌలు రైతును గుర్తించాలని, వారికి అవసరమైన కౌలుకార్డును జారీ చేయాలని వీఆర్వో వీపీఏలకు సూచించారు. ఈకార్డు కాలపరిమితి ఏపీ కౌలుదారుల చట్టం 2019 ప్రకారం 11నెలల ఉంటుందన్నారు. కౌలుకార్డు జారీలో భూయజమానికి, కౌలుదారుడి అగ్రిమెంట్‌పైన గ్రామ రెవెన్యూ అధికారి సంతకం ఉండాలన్నారు. సంతకం చేసే ముందు సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. కౌలుదారుడు కార్డు దరఖాస్తు చేసుకున్న మూడురోజుల్లో కార్డు ఇవ్వాలన్నారు. కౌలుకార్డు పొందిన రైతులకు వేసిన పంట మీదమాత్రమే అధికారం ఉంటుందన్నారు. సంబంధిత భూయజమాని ఆగ్రామంలో లేకపోతే వీడియో లేదా ఈమెయిల్ ద్వారా తమ నిర్ణయాన్ని తెలియజేయవచ్చన్నారు. వ్యవసాయాధికారి జైనలుబ్దీన్ మాట్లాడుతూ ప్రతి కౌలురైతు తప్పనిసరిగా కార్డు తీసుకోవాలని సూచించారు. ప్రతికౌలు రైతు వేసిన పంటను నమోదు చేసుకొని ప్రభుత్వం నుంచి వచ్చే పంటనష్టపరిహారం, సబ్సిడీ విత్తనాలు, పంటల బీమా అర్హత పొందవచ్చన్నారు. అదే విధంగా బ్యాంకు రుణాలు కౌలురైతుకు వచ్చే విధంగా చేయాలని ఆయన కోరారు. రైతు పండించిన పంటలను అమ్ముకునేందుకు కూడా కౌలుకార్డు ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో అన్ని గ్రామాల వీఆర్వోలు, వీపీఏలు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయాధికారులు

గిద్దలూరు టౌన్, జూలై 10 : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంతో తమ ప్రాణాలు కాపాడుకోవచ్చని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీ సారాదానమ్మ అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సూచన మేరకు ద్విచక్ర వాహనాలు నడిపే వారితోపాటు వెనుక కూర్చున్న వారు రక్షణ పొందుటకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించిన నేపథ్యంలో స్థానిక కోర్టు భవనాల ప్రాంగణంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీని ఉద్దేశించి న్యాయాధికారులు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ద్విచక్ర వాహనాల అవసరం ఏర్పడిందని, వాహనాలు ఎక్కువై ట్రాఫిక్ సమస్యలు ఎక్కువైనట్లు తెలిపారు. రోడ్డుపై ప్రయాణించేటపుడుద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోతే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.ఎస్.శేషశైనారెడ్డి, షేక్ ఉస్మాన్‌షరీఫ్, యు.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ వాడాలని ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారులు

వాహనదారులకు సీఐ అవగాహన

పట్టణంలోని మోడంపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం స్థానిక అర్బన్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హెల్మెట్ లేని వాహన చోదకులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ లేకుంటే ప్రాణాలకు రక్షణ ఉండదని, హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. హెల్మెట్ లేనిచో జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి, జూలై 10 : సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఫీవర్‌సర్వే చేయాలని సూచించారు. సీజనల్‌గా వచ్చే డెంగ్యూ మలేరియా వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురికిగుంతలు, వర్షపునీరు నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



హెల్త్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మాగుంట రాఘవరెడ్డి

పొదిలి, జూలై 10 : మండలం, పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పొదిలి, కొనకనమిట్ల మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డిని కోరారు. ఎన్నికల తరువాత మొదటిగా పొదిలి వచ్చిన రాఘవరెడ్డిని నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పట్టణంలో నెలకొన్న సమస్యలపై రాఘవరెడ్డికి నాయకులు వివరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలను కలిసిన క్రమంలో మండలంలో ప్రధానంగా ఉన్న సమస్యలను ఆశీసన దృష్టికి తీసుకెళ్ళారు. మండలంలో తాగునీరు, డ్రైనేజ్, పారిశుధ్య, ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. అదే విధంగా పట్టణంలో పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్య అధ్వాన్నంగా ఉందని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రాఘవరెడ్డిని కోరారు. స్పందించిన ఆయన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో మాట్లాడి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చేసుకుందామని చెప్పారు. ఈకార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల అధ్యక్షులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్, సెల్ షాప్ ప్రారంభం

పట్టణంలోని చిన్నబస్టాండ్ సెంటర్‌లో మాకినేని అమరసింహం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ అమృత పెట్రోల్ బంక్‌ను మాగుంట రాఘవరెడ్డి ప్రారంభించారు. ముందుగా రాఘవరెడ్డిని టీడీపీ, బీజేపీ నాయకులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.



మాగుంట రాఘవరెడ్డికి సమస్యలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

కార్యకర్తలతో సమావేశం

మార్కాపురం : మార్కాపురం నియోజకవర్గంలోని పలు మండలాల కార్యకర్తలతో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి బుధవారం సమావేశమయ్యారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు మండలాలకు చెందిన కార్యకర్తలు రాఘవరెడ్డితో తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం టీడీపీ, జనసేన ముఖ్య నాయకులతో కొద్దిసేపు నియోజకవర్గ పరిస్థితులపై సమావేశమయ్యారు. త్వరలో జరుగనున్న అధికారుల బదిలీల విషయంపై చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, రెండు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పెన్నులు, అట్టల పంపిణీ



బాలికలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కంభం, జూలై 10 : కంభం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక బీసీ బాలికల వసతి గృహ విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, తదితర సామగ్రి పంపిణీ చేశారు. కంభం లయన్స్ చేగిరెడ్డి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బైసాని వెంకటరామకృష్ణ, జోన్‌చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్, క్లబ్ కార్యదర్శి పేర్ని గుండయ్య, కోశాధికారి ఎస్.వెంకటరావు, పాస్ట్‌ప్రెసిడెంట్ మొగల్ మహబూబ్ బేగ్, సయ్యద్ జాకీర్‌హుస్సేన్, ఎస్.కేశవ, నాగేశ్వరరావు, హాస్టల్ వార్డెన్ పార్వతి భాయి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

గిద్దలూరు, జూలై 10 : మండలంలోని పొదలకొండపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ కాపీ రైటింగ్ పుస్తకాలను పంపిణీ చేసింది. ఈకార్యక్రమంలో దాత, సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య, హెచ్‌ఎం రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డీజీపీకి బొకే ఇస్తున్న ముత్తుముల, జనార్దన్, ఎరిక్షన్‌బాబు

డీజీపీని కలిసిన ఎమ్మెల్యేలు

గిద్దలూరు టౌన్, జూలై 10 : డీజీపీ ద్వారక తిరుమలరావును గిద్దలూరు, ఒంగోలు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం రాత్రి మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో గిద్దలూరు, ఒంగోలు ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్‌తోపాటు యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన్ను శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జూలై 10: మండలంలోని తీరంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు కోసం బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్‌ను మంజూరు చేసింది. తొలుత ఫిషింగ్ హార్బర్‌ను కొత్తపట్నం తీరంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ఏర్పాటుకు ప్రభుత్వం ప్రజాభిప్రాయసేకరణ కూడా జరిపింది. అయితే మత్స్యకారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో మండలంలోని రంగాయపాలెం, పిన్నివారిపాలెం గ్రామాల తీరంలో ఈ ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తీరంలోని ఈస్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ స్థలాల వివరాలను స్థానిక అధికారులను అడిగి జాయింట్ కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ వెంట కొత్తపట్నం తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

టీచర్ల బోధన మెరుగుకే టీచ్‌టూల్

ఒంగోలు(విద్య), జూలై 10 : తరగతి గదిలో ఉపాధ్యాయులు తమ బోధనను మెరుగుపర్చుకునేందుకు టీచ్ టూల్ కార్యక్రమం దోహదపడుతుందని డీఈవో సుభద్ర తెలిపారు. ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ తరగతి వాతావరణం, బోధన పద్ధతులు, సామాజిక భావోద్వేగాల క్షణాలను పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. శిక్షణ పొందిన టీచర్లు తోటి ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి టీచ్‌యాప్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఎంఈవో కిషోర్‌బాబు, ఏఎంవో ఎం.రమేష్, జిల్లా కో ఆర్డినేటర్ కిషన్‌నాయక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న టీచర్లకు డీఈవో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ నిరసనలు

గిద్దలూరు, జూలై 10 : కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆల్ ఇండియా డిమాండ్స్‌డే కార్యక్రమంలో భాగంగా కార్మికులు రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల అనంతరం కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్ అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడానికి సిద్ధపడిందని ఆరోపించారు. లేబర్ కోడ్ బిల్లు అమలు అయితే కార్మికుల హక్కులు హరించుకు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షులు పద్మ, కార్యదర్శి నరసింహులు, వివిధ శాఖల్లోని కార్మిక సంఘాల ప్రతినిధులు నాగయ్య, సమీర, శ్రీనివాసులు, ఆనందరావు, విశ్రాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల కార్మికులు



కంభం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సమస్యలను పరిష్కరించాలి

కంభం : ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కంభం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ షేక్ ఖాజావలి మాట్లాడుతూ నూతనంగా అమలులోకి వచ్చిన 3 క్రిమినల్ న్యాయచట్టాలను నిలుపుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీ కరణను, జాతీయ నగదు బదిలీ పథకాన్ని ఆపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి


మార్కాపురం వన్‌టౌన్ : కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకులు సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ కార్మికులపై రాజకీయ వేధింపులు వెంటనే ఆపాలని, లేబర్ కోడ్ రద్దు చేయాలని, కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు, అంగన్‌వాడీలు అనంత కుమారి, కరుణ, జ్యోతి, శైలజ, లలిత, సరళ, కాళింటీ, పార్వతి, సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్ద దోర్నాల : కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు తిరుపతిరెడ్డి కోరారు. సీఐటీయూ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న డిమాండ్స్ డేలో భాగంగా మండల సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు కార్యాలయంలో అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వై. సుబ్బమ్మ, వెంకటరత్నమ్మ, వెంకటలక్ష్మి, నాగేంద్ర, మల్లేశ్వరి, మరియమ్మ, సత్తిభాయి, అలివేలు, బాలాకుమారి పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రగొండపాలెం : అంగన్వాడీ కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఎర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు రఫీ, సత్యనారాయణ, అమీర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు మల్లేశ్వరి, పద్మ, రూత్‌మేరీ, సుభాషిణి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దోర్నాలలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వ్యాసరచన విజేతలకు బహుమతులు

గిద్దలూరు, జూలై 10 : రాచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తొలి స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితచరిత్రకు సంబంధించి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలైన ధనుష్‌రెడ్డి, సుహాసిని, ఉజ్వలకు బహుమతులు అందచేశారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆంగ్లేయుల మీద చేసిన తిరుగుబాటు గురించి వివరించారు. వివిధ రంగాలలో సేవ చేసిన వారికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలను దాతల సహకారంతో అందచేస్తున్నట్లు నిరాహకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ నారాయణరెడ్డి, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు శ్రీకాంత్, పాఠశాల హెచ్‌ఎం రామానాయక్, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాతలు

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



వారాహి అమ్మవారికి పూజలు చేస్తున్న వేదపండితులు

త్రిపురాంతకం, జూలై 10: వారాహి అమ్మవారి జన్మ నక్షత్రం ఆషాడ శుద్ధ పంచమి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మామిళ్ళపల్లి నాగఫణిశాస్త్రి, ఫణీంద్రకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ గోపురంపై ఉన్న వారాహి అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పార్చణ, వారాహి హోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈపూజలలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు బైకు ఢీ - ఒకరికి గాయాలు

త్రిపురాంతకం, జూలై 10: వేగంగా ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొన్న ప్రమాదంలో బైకుపై వెళుతున్న వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని గొల్లపల్లి వద్ద ఎన్‌హెచ్ 544 డీపై బుధవారం జరిగింది. విశ్వనాథపురం గ్రామానికి చెందిన శేఖర్ గొల్లపల్లిలో ఉంటూ ఆర్‌ఎంపీ వైద్యుడిగా సేవలు అందిస్తున్నారు. ఈనేపథ్యంలో దీవేపల్లి వెళ్లి బైకుపై తిరిగి వస్తున్న క్రమంలో కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న శేఖర్‌కు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 సహాయంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆర్టీసీ బస్సులకు తీవ్ర కొరత

వైసీపీ పాలకుల అసమర్థత వలన నిర్వీర్యమైన సంస్థ

జగన్ ఏలుబడిలో ఒక్క దర్శి మండలంలోనే

పలు గ్రామాలకు సర్వీసుల నిలిపివేత

అవస్థలు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు



బస్సులు లేక ఆటోల్లో వెళ్తున్న విద్యార్థులు



గడియారస్తంభం సెంటర్‌లో బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు

దర్శి, జూలై 10 : దర్శి నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రమైంది. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఎంతసేపు వేచి చూసినా బస్సులు రాక విసుగుచెంది ఆటోలకు వెళ్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సహితం బస్సులు సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారు. రోజురోజుకు జనాభా పెరుగుతుండగా బస్సుల సంఖ్య మాత్రం తగ్గిపోతోంది. వైసీపీ అసమర్థ పాలన వలన గత ఐదేళ్లల్లో ఆర్టీసీ వ్యవస్థ నిర్వీర్యమైంది. కొత్త బస్సులను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. అనేక బస్సులు కాలం చెల్లిపోవటంతో మూలనపడ్డాయి. ఉన్న కొద్దిపాటి బస్సులతో ఆర్టీసీ కాలం గడుపుతోంది.

నియోజకవర్గంలో ఎక్కడా ఆర్టీసీ డిపో లేదు. పొదిలి, అద్దంకి, వినుకొండ డిపోల నుంచి వచ్చిన బస్సులమీదనే ఆదారపడాల్సి వచ్చింది. దగ్గరలో ఉన్న పొదిలి డిపో అన్నీ ప్రాంతాలకు బస్సులు నడపటం లేదు. గతంలో దర్శి-శామంతపూడి, రాజంపల్లి- ఆరవల్లిపాడు, రాజంపల్లి-సీతారాంపురం, పొతకమూరు-పాపిరెడ్డిపాలెం, దర్శి-పోతవరం తదితర ప్రాంతాలకు గతంలో ఆర్టీసీ బస్సులు నడిచేవి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రూట్‌లలో తిరిగే బస్సులన్నీ రద్దు చేశారు. ఆ గ్రామాల ప్రజలకు ఆటోలే దిక్కు అయ్యాయి. అనేక గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకునేందుకు దర్శికి వచ్చి వెళ్తుంటారు. వీరందరికీ బస్సు సదుపాయం లేకపోవటంతో ఆటోల్లో వెళ్లి రావాల్సిన పరిస్థితి నెలకొంది. మిగిలిన గ్రామాలకు చెందిన విద్యార్థులకు కూడా సకాలంలో బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు ప్రారంభించే సమయం, ఇంటికి వెళ్లే సమయంలో కొన్ని బస్సులను ప్రత్యేకంగా విద్యార్థుల కోసం నడిపేవారు. వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థుల గూర్చి పట్టించుకున్న పాపా నపోలేదు. దీంతో విద్యార్థులు ప్రధానంగా బాలికలు ఎంతో అసౌకర్యానికి గురవుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. సీఎం చంద్రబాబు గతంలో మాదిరి ఆర్టీసీ బస్సులను పునరుద్ధరిస్తారని ఆశతో ఎదురుచూస్తున్నారు. బస్సుల సంఖ్యను పెంచాలని అన్నీ రూట్లకు బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థినులు కళాశాల గౌరవాన్ని మరింత పెంచాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

జ్ఞాపికలు అందించిన ఎమ్మెల్యే, మాగుంట రాఘవరెడ్డి



విద్యార్థినులకు జ్ఞాపికలు అందిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, రాఘవరెడ్డి

కనిగిరి, జూలై 10 : విద్యార్థినులు తమ కళాశాల గౌరవాన్ని మరింత పెంచేలా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. 2024 ఇంటర్ సప్లిమెంటరీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలకు బుధవారం స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఎంపీ తనయుడు మాగుంట రాఘవరెడ్డితో కలసి ఎమ్మెల్యే జ్ఞాపికలు బహూకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ తనయుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంపై తమ కుటుంబానికి ఎనలేని ప్రేమాభిమానాలు ఉన్నాయని, అందుచేత ఈ ప్రాంతానికి చెందిన కుటుంబాలు విద్యాపరంగా రాణించాలన్నదే తమ ఆశయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్‌లకు నీటి నాణ్యత పరీక్ష తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఈ మోహన్‌రావు

పీసీపల్లి, జూలై 10 : ఆర్వోప్లాంట్లు విక్రయిస్తున్న నీటికి నాణ్యత పరీక్ష తప్పనిసరి అని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ సహాయక ఇంజనీర్ జి.మోహన్‌రావు చెప్పారు. డయేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా పీసీపల్లి సచివాలయంలో పంచాయతీరాజ్, సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ప్రతిఒక్కరూ తమ ప్లాంట్‌లోని నీటిని నాణ్యతా పరీక్షలు చేయించుకుని, సురక్షితమని నిర్ధారణ అయిన తరువాతే ప్రజలు సరఫరా చేయాలని చెప్పారు. నాణ్యతా పరీక్షా సర్టిఫికెట్ లేకుండా శుద్ధి జలాల పేరుతో నీటిని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటినాణ్యతా పరీక్ష చేయించుకునేందుకు ప్లాంట్ నిర్వాహకులు 9618818870 ల్యాబ్‌కెమిస్ట్, 7842148365 ల్యాబ్ మైక్రోబయాలసిస్ట్‌లను సంప్రదించాలని కోరారు.

కనీసం రూ.26 వేలు ఇవ్వాలి

పామూరు, జూలై 10 : అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య, కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి డిమాండ్ చేశారు. కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అల్లభక్ష్, గౌస్‌బాష పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

దర్శి, జూలై 10 : గత 13 నెలలుగా బకాయి ఉన్న పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ క్లాస్ మిత్ర పారిశుధ్య కార్మికులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి టి. రంగారావు మాట్లాడుతూ నిరుపేదలైన పారిశుధ్య కార్మికులు చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఇప్పుడైనా పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈవోఆర్డీ శోభన్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాచపూడి ఎడ్లర్, జి. బాలగురవయ్య, ఎస్తేరమ్మ, వెంకటయ్య, రావూరి జాన్, ఆనందరావు, ఇస్సాక్, దావీదు పాల్గొన్నారు. అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ చార్జీలు పెంచాలని నిర్వాహకులు ఎంఈవో రఘురామయ్యకు వినతిపత్రం సమర్పించారు.

పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలి

తాళ్లూరు, జూలై 10 : గ్రామాల్లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని మండల సీఐటీయూ అధ్యక్షుడు పూనూరి రామారావు డిమాండ్ చేశారు. ఆమేరకు సీఐటీయు నేతలు ఎంపీడీవో కె.యుగకీర్తికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నేత రామారావు, కార్మికులు సాల్మన్, కోటయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కోతుల బెడద

పామూరు, జూలై 10 : మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇంట్లోని వస్తువులను ఎత్తుకెళ్లి నష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా లక్ష్మీనరసాపురం, రేణిమడుగు, దూబగుంట, పుట్టంనాయుడుపల్లి, బొట్లగూడూరు. మోపాడు, తదితర గ్రామాల్లో కోతుల సంచారం ఎక్కువగా ఉంది. బజార్లలో నడిచి వెళ్తుంటే చేతుల్లోని కవర్లను సైతం లాగేస్తు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటిని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఈఈ

కొప్పెరపాడు సబ్ స్టేషన్‌లో మందు పార్టీ ఘటనపై

షిఫ్ట్ ఆపరేటర్ తొలగింపు

విచారించిన విద్యుత్ విజిలెన్స్ అధికారులు

బల్లికురవ, జూలై 10 : విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మార్టూరు సబ్ డివిజన్ విద్యుత్ శాఖ డీఈఈ ఎం.సురేంద్రబాబు హెచ్చరించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో సబ్ స్టేషనా.. మద్యం దుకాణమా అనే కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. డీఈఈ సురేంద్రబాబు కొప్పెరపాడు సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి సోమవారం రాత్రి మద్యం పార్టీ జరిగిన విషయమై సిబ్బందిని విచారించారు. ఆసమయంలో ఎవరు ఉన్నారు ఉన్నదీ ఆరాతీశారు. వైదన గ్రామస్థులు విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రి సమయంలోఏ అక్కడకి రాగా సిబ్బంది కొందరు పుట్టిన రోజు పండగ వేడుకలు జరుపుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై డీఈఈ సిబ్బందిని ప్రశ్నించారు. ఎవరైనా డ్యూటీ సమయంలో మద్యం సేవించి విధులకు హాజరైతే వెంటనే వారిపై కేసులు నమోదు చేసి విధుల నుంచి తప్పిస్తామని అయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా విద్యుత్ సమస్యపై ఫోను చేస్తే వారికి సరైన సమాధానం చెప్పాలన్నారు. ఈ విచారణలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్ ఖాజావలి విధుల నుంచి తొలగింపు

కొప్పెరపాడు సబ్ స్టేషన్‌లో మద్యం పార్టీ జరిగిన సమయంలో సోమవారం రాత్రి విధులలలో ఉన్న షిఫ్ట్ ఆపరేటర్ ఖాజావలిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు మార్టూరు విద్యుత్ సబ్ డివిజన్ డీఈఈ సురేంద్రబాబు తెలిపారు. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనం మేరకు విచారణ జరిపామని చెప్పారు. ముందస్తుగా డ్యూటీలో ఉన్న వారిని బాధ్యులను చేస్తూ షిఫ్ట్ ఆపరేటర్‌ను తొలగిస్తున్నట్లు అయన తెలిపారు.

పార్టీపై విచారణ

కొప్పెరపాడు సబ్ స్టేషన్‌లో మద్యం పార్టీ జరిగిన ఘటనపై బుధవారం ఒంగోలు ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జునరావు విచారణ జరిపారు. ఆసమయంలో విధులలో ఉన్న సిబ్బందిని విచారించారు. అలానే వైదన గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు అనే యువకుడు రాత్రి సమయంలో రాగా అక్కడ మద్యం పార్టీ జరుగుతుందని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడిని కూడా పిలిపించి విచారణ జరిపారు. రాత పూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. మద్యం పార్టీ జరిగిన సమయంలో పలు గ్రామాలకు చెందిన విద్యుత్ సిబ్బంది కూడా ఉన్నారని దానిపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరిపి వారిపై కూడా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దర్శి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, జూలై 10 : దర్శి పట్టణంలో మౌలిక వసతులు పెంపొందించి సర్వాగసుందరంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో రూ.14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు బుధవారం సాయంత్రం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను కొద్దిరోజుల క్రితం కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, కౌన్సిలర్ వై సరస్వతి, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, ఐ టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి సందు రామయ్య, నాయకులు నక్కా బాలరంగా, నాగమణి, వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో ఏపీటీఎఫ్ అధ్యయన తరగతులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి, జూలై 10 : ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి అధ్యయన తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. నూతన సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఉద్యమ, అధ్యయన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ మంజుల, భానుమూర్తి పాల్గొంటారన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఏఎల్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారిణి డాక్టర్ సునీత

దొనకొండ, జూలై 10 : హాస్టల్‌లో చదువుకునే విద్యార్థులు దోమల బారిన పడకుండా దోమతెరలు ఉపయోగిస్తూ తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సునీత వివరించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా దొనకొండలోని కేజీబీవీ పాఠశాల, బీసీ, ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లలో దోమల నిర్మూలనకు ఆల్ఫా సైఫోమిత్రిన్ మందును బుధవారం పిచకారీ చేయించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, డయేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి కృష్ణ, ఆరోగ్యకేంద్రం సీహెచ్‌వో ఇన్నాసమ్మ, ఎంపీహెచ్‌వో ఫ్లెమింగ్, ఏఎన్ఎం ఇందిరా, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి మమత, సంక్షేమాధికారులు మంత్రూనాయక్, సురేష్, ప్రభావతి పాల్గొన్నారు. గంగదేవిపల్లిలో ఆరోగ్యకేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కె ప్రభావతీదేవి నేతృత్వంలో డెంగ్యూ వాధిపై నివారణ వారోత్సవాలు నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించి అవగాహన కల్పించారు. అనంతరం దోమల నివారణపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం స్వరాజ్యలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ ఎం దేవి పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఆరోగ్యకేంద్రం సిబ్బంది

రెండేళ్ల క్రితం కొన్నామంటూ దేవదాయ భూముల కబ్జా



పామూరు దేవదాయ భూముల్లో చదును చేసి ఉన్న ఆక్రమణదారులు

పామూరు, జూలై 10 : పామూరులోని విరువూరు రోడ్‌లో శ్రీవల్లీ భుజంగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూములను రెండేళ్ల క్రితమే కొన్నామంటూ వాటిని ఆక్రమించేందుకు కొందరు రంగం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా భూములను చదును చేసి వెంచర్ వేసేందుకు పావులు కదుపుతున్నారు. ఎండోమెంట్‌కు చెందిన సర్వేనెంబర్ 256/3 లో 29.33 ఎకరాల భూమి ఉంది. ఆ భూములను ఆక్రమించుకొని పదేళ్ల క్రితంపైనే కొందరు రేకుల షెడ్లు నిర్మించారు. ఆ తర్వాత కాలంలో ఆ నిర్మాణాలను వారు అమ్మేశారు. అంతేగాక ఆ పక్కనే ఉన్న దేవదాయ భూములను కలిపి విక్రయించారు. తాజాగా కొందరు ఖాళీగా ఉన్న దేవదాయ భూమిలో వెంచర్లు వేసేందుకు చుట్టూ ఫెన్సింగ్ వేశారు. బుధవారం విషయం తెలుసుకొన్న ఎండోమెంట్ ఈవో నరసింహబాబు దేవస్థాన కమిటీ సభ్యులతో కలిసి జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకున్నారు. ఆక్రమణదారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎండోమెంట్ భూములను ఆక్రమించుకుంటే పోలీస్ కేసులు నమోదు చేయిస్తామని ఈవో హెచ్చరించారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం

ఆంధ్రజ్యోతి కథనాలతో కదిలిన ఆర్డీవో, కమిషనర్

అక్రమ కట్టడాలను తొలగించి, బిల్డింగులను

ప్రభుత్వ పరంచేసిన అధికారులు



కనిగిరి ప్రజారోగ్య ఇంజనీరింగ్ కార్యాలయానికి కేటాయించిన ఆక్రమిత భవనం

కనిగిరి, జూలై 10: కనిగిరి ప్రాంతంలో ఇష్టారాజ్యంగా సాగిన ఆక్రమణలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన వరుస కథనాలతో అధికారుల కదిలారు. ఆర్డీవో జాన్‌ఇర్విన్, కమిషనర్ టీవీ రంగారావు ఆక్రమణలపై, ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతూ ఆక్రమణలు తొలగించి వేస్తున్నారు. ఇప్పటికే కనిగిరి - ఒంగోలు రోడ్డులో, కనిగిరి - పామూరు రోడ్డులో గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు అక్రమంగా వేసిన వెంచర్లపై, ప్రభుత్వ భూములు ఆక్రమణలను తొలగించారు. ఇంకా అక్రమంగా వేసిన వెంచర్లు, వాగు, పోరంబోకు, పశువలు బీడు భూములు ఆక్రమణలపై జల్లెడ పడుతున్నారు. ఇంకో పక్క ప్రభుత్వ స్థలాల్లో ఉన్న బిల్డింగులను స్వాధీనం చేసుకున్నారు. వాటిల్లో ఇటీవల పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీ 11వ వార్డు పరిధిలోని హైవే రోడ్డు వెంట ఉన్న ఆక్రమణలను తొలగించటంతో పాటు ఆయా స్థలాల్లో ఉన్న బిల్డింగులను స్వాధీనం చేసుకుని కనిగిరి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి ఓ బిల్డింగును విద్యుత్‌శాఖ కార్యాలయానికి వినియోగించేందుకు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆక్రమణదారుల్లో గుబులు మొదలైంది.

విద్యుత్ అక్రమ వినియోగంపై విజిలెన్స్ తనిఖీలు

వేటపాలెం(చీరాల), జూలై 10 : విద్యుత్ అక్రమ వినియోగంపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. మండల పరిధిలోని రూరల్ సెక్షన్‌లో బుధవారం విజిలెన్స్ ఈఈ కట్ట వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఈఈ జాన్‌థామస్, విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ క్రమంలో అధికారులు వివరాలు వెల్లడించారు. మొత్తం 2,500 సర్వీసులను తనిఖీ చేసినట్లు చెప్పారు. వాటిలో అధిక లోడుకు సంబంధించి 127 కేసులు, మాల్ ప్రాక్టీసుకు సంబంధించి 4 కేసులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించి ఒక కేసు మొత్తం 132 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయా కేసులకు సంబంధించి రూ.6,35,000 జరిమానా విధించారు. ఈ తనిఖీలలో చీరాల డీఈఈ టి.శ్రీనివాసరావు, పర్చూరు డీఈఈ ఎస్.రమేష్, వేటపాలెం రూరల్ ఏఈ వి.భాస్కరరావు, చీరాల డివిజన్ ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు డిజిటల్‌గా చెల్లించుకోవచ్చు

ఇకపై విద్యుత్ వినియోగదారులు తాము వినియోగించుకున్న విద్యుత్‌కు సంబంధించిన బిల్లులు ఆర్‌బీఐ నిబంధనల మేరకు డిజిటల్‌గా ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌లలో చెల్లించవచ్చని ఈఈ జాన్‌థామస్ తెలిపారు. అందుకు సంబంధించి గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీసీపీడీసీఎల్ కన్స్యూమర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించవచ్చన్నారు. అలానే డెబిట్, క్రెడిట్, నెట్‌బ్యాంకింగ్, వాలెట్స్, కాష్ కార్డ్స్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

ముగ్గురు ఉద్యోగులకు మెమో ఇచ్చిన ఎంపీడీవో

తాళ్లూరు, జూలై 10 : మండలంలోని శివరాంపురం సచివాలయంలో పని చేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు ఎంపీడీవో కె.యుగకీర్తి మెమోలు జారీ చేశారు. ఈ నెల 1వ తేదీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ సమయంలో పెన్షన్‌దారుల పట్ల ప్రవర్తించిన తీరు, సీఎం చంద్రబాబుపై అనుచిత మాటలు, మాజీ సీఎం జగన్ పట్ల స్వామి భక్తిప్రదర్శించడం వంటి చర్యలకు ముగ్గురు ఉద్యోగులు పాల్పడ్డారు. సచివాలయ సర్వేయర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.రాజశేఖర్‌రెడ్డి, మహిళా పోలీస్ ఎస్.శివపార్వతిలపై గ్రామ టీడీపీ నేతలు, పెన్షన్‌దారులు 3వ తేదీ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. 3 రోజుల్లో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి సంజాయిషీ ఇవ్వాలని ఎంపీడీవో ఆదేశించారు. ఆరోపణలు నిజమని తేలితే క్షమశిక్షణా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని మెమోలో పేర్కొన్నారు.



● కంపచెట్ల తొలగింపు తరువాత మంత్రుల భవన సముదాయం



కంపచెట్ల నడుమ హైకోర్టు భవనం, ఐఏఎస్ అధికారుల భవనాలు


- ఐదేళ్ల నిర్లక్ష్యం ఫలితంగా అడవిలా అమరావతి
- 26 వేల ఎకరాల్లో కంపచెట్లతో చిట్టడవిలా రాజధాని
- ప్రభుత్వ భవనాలను కమ్మేసిన కర్రతుమ్మ కంప చెట్లు
- కంపచెట్ల తొలగింపుతోనే నవనగర పునర్నిర్మాణం
- కంపచెట్ల తొలగింపుతో మారుతున్న రూపురేఖలు
- హుందాగా సిద్ధమవుతున్న రాజధాని రహదారులు




● కొత్త సొబగులు అద్దుకున్న ఉద్యోగుల భవన సముదాయం




నాడు అడవిలా.. నేడు అందంగా



● కంపచెట్ల మధ్య క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయం



● కంపచెట్ల మధ్య ఎన్ఐడీ, విట్ విద్యా సంస్థలు



● కంప చెట్లలో కనపడకుండా పోయిన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

అద్భుత నగరంగా విరాజిల్లాల్సిన అమరావతి ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం నిర్వాకం పుణ్యమా అని అడవిలా మారిపోయింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి బలైపోయింది. గత టీడీపీ ప్రభుత్వం 2014- 19 మధ్య నిర్మించిన ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు తప్ప మిగిలిన ప్రాంతమంతా అడవిలా మారిపోయింది. కోర్ క్యాపిటల్‌లో అడుగు స్థలం కూడా ఖాళీ లేకుండా కంప చెట్లు పెరిగిపోయాయి. మొత్తంగా 26వేల ఎక రాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఐదేళ్ల లో అడవిలా మారిన అమరా వతి కూటమి ప్రభుత్వంలో కొత్త ఊపిరిలు పోసుకుంటోంది. జవసత్వాలు నింపుకుని ఠీవీగా నిలిచేందుకు తపన పడుతోంది. అమరావతిని మింగేసిన కంపచెట్లపైనే కూటమి ప్రభుత్వం ఎక్కుపెట్టింది. కంపచెట్ల తొలగింపుతో నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి నాంది పలికింది.

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 2019 డిసెంబర్‌లో వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చి రాజధాని అమరావతి ధ్వంస రచనకు శ్రీకారం చుట్టింది. రాజధాని పరిధిలో వున్న 29 గ్రామాలు, రైతులు ఇచ్చిన భూములు అన్నీ గత ప్రభుత్వ వికృత క్రీడలో నాశనమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా కేంద్రంగా ఉండే కోర్ క్యాపిటల్ కర్రతుమ్మ చెట్లతో చిట్టడవిలా మారిపోయింది. కోర్ క్యాపిటల్‌లో సెక్రటేరియట్ టవర్స్ నీటిలో మునిగిపోగా, ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, రాష్ట్ర హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, న్యాయమూర్తులు, ప్రిన్సిపల్ కార్యదర్శులకు నివాసాలు, ఐఏఎస్ అధికారులు, సెక్రటేరియట్ ఉద్యోగుల కోసం నిర్మించిన భారీ భవన సముదాయాలు కంపచెట్ల పాలయ్యాయి. భవనాల సంగతి ఎలా ఉన్నా నిర్వహణను కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రోడ్లు, రైతుల ప్లాట్లు సహా ఖాళీ ప్రదేశమంతా తుమ్మచెట్లతో నిండిపోయింది. ప్రభుత్వ భవన సముదాయాలకు వెళ్లే దారులు కూడా కనిపించనంతగా తుమ్మకర్ర పెరిగిపోయింది. కేంద్ర సంస్థలకు కర్రతుమ్మ బెడద తప్పలేదు. విట్, ఎన్ఐడీ వంటి ప్రతిష్ఠాత్మక కేంద్ర సంస్థలు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అమరావతిలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. గడిచిన ఐదేళ్లుగా వేలాది మంది విద్యార్థులు అక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో విద్యా సంస్థల బస్సులు, వందల సంఖ్యలో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా సరే రోడ్లు పడలేదు. కర్రతుమ్మ బెడద తప్పలేదు.

● మారుతున్న రూపురేఖలు

అమరావతి అడవిలా మారిపోయిన విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందే జూన్ 11న జంగిల్ క్లియరెన్సుకు టెండర్లు ఆహ్వానించారు. దాదాపు 200 ఎక్సకవేటర్లతో పనులు ప్రారంభించారు. తొలి అడుగుగా ప్రభుత్వ భవనాలు, ప్రధాన రహదారులను చుట్టుముట్టిన కంపచెట్ల తొలగింపుకు పూనుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు నెల రోజుల్లో రెండుసార్లు పర్యటించి పనుల తీరును పరిశీలించారు. అధికారులను పరుగులు పెట్టించారు. కేంద్ర పెద్దలను ఒప్పించి అమరావతి కోసం నిధులు మంజూరు చేయించే ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లారు. ప్రభుత్వ చిత్తశుద్ధి కారణంగా గడిచిన నెలరోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు సాగుతుండడంతో అమరావతి రూపురేఖలు చాలా వరకూ మారిపోయాయి. కొత్త సొబగులు అద్దుకుంటున్నాయి. నిన్నటి వరకూ దుమ్ము, ధూళితో బూజుపట్టిన ప్రభుత్వ భవనాలు దుమ్ము దులుపుకుని అందంగా ముస్తాబవుతున్నాయి. ఎమ్మెల్యే క్వార్టర్లు, మంత్రుల భవనాలు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాసాలు, క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలు దర్జాగా సిద్ధమవుతున్నాయి. తొలగించిన కంప చెట్ల మధ్య ఠీవీగా తలెత్తుకు నిలుచున్నాయి. ఆకాశాన్ని తాకే అద్భుత భవనాలు నవనగరానికి కొత్త శోభనిస్తున్నాయి. సీడ్ యాక్సిస్ రోడ్డు సహా అనేక రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కంపచెట్లను తొలగించి రోడ్లను విస్తరించి తిరిగి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అందమైన రోడ్లు నేడు హుందాగా ప్రజలకు దర్శనమిస్తున్నాయి. రోడ్లకు ఇరుపక్కలా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు సిద్ధం చేస్తున్నారు. తద్వారా అమరావతిలో కొత్త వెలుగులు రాబోతున్నాయి.

ప్రభుత్వ భవనాల పనులు పురోగమిస్తున్న క్రమంలో క్రమంలో మిగిలిన పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజధాని పరిదిలో 26 ఎకరాల్లో అడవిలా పెరిగిన కంపచెట్ల తొలగింపుపై ప్రభుత్వ దృష్టిపెట్టింది. కంప చెట్ల తొలగింపునకు సంబంధించి 30 కోట్ల రూపాయల వరకూ ఖర్చు అవుతుందని అధికారుల అంచనా వేశారు. టెండర్ల ప్రక్రియలో భారీ కంపెనీలు పాల్గొంటున్నట్లు అధికారుల ద్వారా అందుతున్న సమాచారం. ఈ ప్రక్రియ కూడా ఈ వారంలో పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. టెండర్లు ఖరారైన నెల రోజుల్లోపు కంపచెట్లను తొలగించి రాజధాని రూపురేఖలు మార్చాలని కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

● 26వేల ఎకరాల జంగిల్ క్లియరెన్సుకు శ్రీకారం



కంపచెట్లు తొలగించిన తర్వాత హైకోర్టుకు వెళ్లే రోడ్డు

రాయితీపై.. సరుకులు

- దేశవాళి కందిపప్పు కేజీ రూ. 160
- నాణ్యమైన స్టీమ్ బియ్యం (బీపీటీ రకం) కేజీ రూ. 49
- రా బియ్యం కేజీ రూ. 48



గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కందిపప్పు, బియ్యం ధరలు రిటైల్ మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో వినియోగదారులకు కొంతమేరకు ఆర్థిక ఉపశమనం కలిగించేందుకు పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైస్, డాల్‌మిల్లర్లతో ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చర్చలు జరిపిన అనంతరం కొంత రాయితీపై కందిపప్పు, బియ్యంని రైతుబజార్లలో ప్రజలకు అందుబాటులోకి ఉంచేందుకు ముందు కొచ్చారు. రెండు, మూడు రోజుల్లో రాయితీ ధరలను బిగ్‌షైన్ మార్కెట్లలో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, మూడు జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 11వ తేదీ గురువారం గుంటూరు జిల్లాలోని పలు రైతుబజార్లు, బాపట్లలో ఆరు చోట్ల, పల్నాడు జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో సబ్సిడీ కందిపప్పు, బియ్యం విక్రయాలను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

కందిపప్పు నేడు రిటైల్ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ. 175 నుంచి రూ. 185 వరకు ఉన్నది. బ్రాండెడ్ కందిపప్పు(గుజరాత్, లాతోర్) అయితే రూ. 200 పైమాటే. మరోవైపు రేషన్ దుకాణాల్లో సబ్సిడీపై తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో విక్రయించిన సబ్సిడీ కందిపప్పుని గత వైసీపీ ప్రభుత్వం నిలిపేసింది. దీంతో చాలా మంది కందిపప్పు వాడకాన్ని తగ్గించేశారు. ప్రత్యామ్నాయంగా ఎర్రపప్పు, పెసరపప్పుని వినియోగిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం నెల రోజులు మాత్రమే అయ్యాయి. ఇప్పటికిప్పుడు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ కందిపప్పుని అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి. ఇందుకు కారణం పౌరసరఫరాల సంస్థ గిడ్డంగులని తనఖా పెట్టి గత వైసీపీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో అప్పులు చేసింది. ఇవన్నీ ఒక కొలిక్కి తీసుకొచ్చి అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసిన అనంతరం కందిపప్పుని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేజీ కందిపప్పు రూ. 130కి సరఫరా చేసేందుకు పల్నాడు జిల్లాలోని డాల్‌మిల్లర్లు ముం దుకు రాగా వారి నుంచి కొనుగోలు చేయకుండా ప్రజలను ఇబ్బందులు పాలు చేసింది.

ఈ నేపథ్యంలో రైతుబజార్లలో దేశవాళి కందిపప్పుని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి మనోహర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు కేజీ కందిపప్పు రూ. 160, నాణ్యమైన స్టీమ్ బియ్యం(బీపీటీ వెరైటీ) కేజీ రూ. 49, రా రైస్ కేజీ రూ. 48కి ప్రత్యేక కౌంటర్లలో విక్రయించనున్నారు. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, ఆర్‌టీసీ బస్టాండ్, తెనాలిలో ఉన్న రెండు, మంగళగిరి, పొన్నూరులో ఉన్న రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లని గురువారం ఉదయం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. అలానే గుంటూరు నగరంలోని 15 పప్పుల హోల్‌సేల్ దుకాణాలలో కూడా దేశవాళి కందపప్పు, రైస్‌మిల్ పాయింట్ల వద్ద బీపీటీ బియ్యం పైన పేర్కొన్న ధరలకు అందుబాటులో ఉంచనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. చిలకలూరిపేటలో రైతుబజార్, మరో కేంద్రం, వినుకొండ, నరసరావుపేట, పిడుగురాళ్లలో రెండు కౌంటర్లు చొప్పున ఏర్పాటు చేశారు. ఇవి ఎక్కువగా ఎంపీడీవో /తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్యవైశ్య కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేశారు. బాపట్ల, వేమూరు, చీరాల, రేపల్లెలోనూ ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. వీటిని మంత్రులు /ఎమ్మెల్యేలు గురువారం ఉదయం ప్రారంభిస్తారు.

జిల్లా అధికారులతో సమీక్షలో మంత్రులు

ఎలా ముందుకెళదాం





కలెక్టరేట్‌లో జరిగిన పరిచయ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రులు, అనగాని, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు, ఎంపీ

- పరిచయ కార్యక్రమం, ఆపై వివిధ అంశాలపై చర్చ
- విభాగాల వారీగా అధికారులతో సమీక్షించిన ఎంపీ, ఎమ్మెల్యేలు
- జరిగిన విధ్వంసాన్ని పూడ్చేలా ప్రణాళికలు చెప్పండని సూచన
- నిజాంపట్నం ఆక్వా పార్క్ ప్రతిబంధకాలు తొలిగిస్తా : మంత్రి అనగాని
- ఇసుక తవ్వకాలు, బినామీ వేటగాళ్లపై చర్యలు తీసుకోండి : మంత్రి రవికుమార్

బాపట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వాస్తవ పరిస్థితి ఇది.. దీనికి మరమ్మతు చేయాలంటే ఏం చేయాలి.. నిధులు ఎంత ఉన్నాయి.. లభ్యత ఎంత.. తక్షణం చేయాల్సిన పనులేమిటి.. మొత్తం మీద ఎలా ముందుకెళ్లాలి.. ప్రజలకు ఎలా మేలు చేయాలి.. అనే దిశగా బుధ వారం బాపట్ల కలెక్టరేట్‌లో సమీక్ష జరిగింది. జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమంతో మొదలైన సమావేశం తర్వాత వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ధ్వంసమైన వ్యవస్థల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యల దిశగా సమీక్ష సాగింది. కలెక్టర్ వెంకటమురళి అధ్యక్షతన జరిగిన పరిచయ కార్యక్రమం, తర్వాత జరిగిన సమీక్షకి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరయ్యారు. ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్‌అండ్‌బీ, మత్స్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ విభాగాలు ప్రాధాన్యాలుగా సమీక్ష జరిగింది. ఆయా శాఖల మీద అధికారులు ప్రజంటేషన్ ఇస్తున్నప్పుడు వాస్తవ పరిస్థితిని చెప్పడంతో పాటు విధ్వంసం జరిగిన చోట ఎలాంటి మరమ్మతులు చేపడితే రైతుల కష్టాలు గట్టెక్కుతాయో ప్రణాళిక బద్ధంగా చెప్పండని, అందరం కలిసి పనిచేసి ఫలితాలు రాబడదామని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు అధికారులకు పిలుపిచ్చారు. గత ప్రభుత్వంలో అర్ధంతరంగా ఆపేసిన పనులపై ఎలా ముందుకెళ్లాలి అనే అంశంతో పాటు ఆ పనులకు సంబంధించిన నిధులు మురిగిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. ఆక్వా రైతులు సాగు రిజిస్ట్రేషన్ లేక నష్టపోతున్నారని మత్స్యశాఖ జిల్లా అధికారి మంత్రి అనగాని దృష్టికి తెచ్చినప్పుడు రెవెన్యూకు సంబంధించిన క్లియరెన్స్‌లను పరిశీలించి ఆమోదిస్తానని హామీ ఇచ్చారు. నిజాంపట్నంలోని ఆక్వా పార్క్ నిర్మాణానికి ఉన్న ప్రతిబంధకాలన్నీ తొలగించి అభివృద్ధికి చర్యలు చేపడతామని తెలిపారు. గుండ్లకమ్మ నదిపై మల్లవరం డ్యాంగేట్లు లేకపోవడం బాధాకరమని మంత్రి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. డ్యాంలో మత్స్యసంపదపై ఆధారపడి వేట సాగిస్తున్న రెండువేల మంది వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల వీధిన పడ్డారని గుర్తు చేశారు. అద్దంకి నియోజకవర్గం తిమ్మాయపాలెం, రామాయపాలెం, దర్శి వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జి కింద జరుగుతున్న ఇసుక తవ్వకాలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి చెరువుల్లో ఇసుక తవ్వకాల వల్ల ప్రమాదం పొంచి ఉందని తెలిసినా అధికారులు ఎందుకు ఉదాసీనంగా ఉన్నారని ప్రశ్నించారు. గుండ్లకమ్మ నది, సింగరకొండ చెరువుల్లో బినామీ వేటగాళ్లను నియంత్రించాలని ఆదేశించారు. యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీ కృష్ణప్రసాద్ తెలిపారు.

29.84 టీఎంసీలు అవసరం..

ప్రస్తుతం సాగునీటి వనరుల లభ్యత తక్కువగా ఉందని ఇరిగేషన్ అధికారులు చెప్పారు. పశ్చిమ కృష్ణాడెల్టా నుంచి నీటి విడుదలకు ఎదురు చూస్తున్నామన్నారు. 29.84 టీఎంసీల నీరు అవసరమని ప్రభుత్వానికి నివేదించినట్లు అధికారులు సమీక్షలో తెలిపారు. కాల్వల మరమ్మతులకు 126 పనుల నిమిత్తం రూ.10.2 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. కృష్ణ పశ్చిమ డెల్టా, సాగర్ కాల్వల నిర్వహణ గడచిన ఐదేళ్ల అధ్వానంగా ఉండడంతో పూడిక తీత పెరిగి కాల్వలపై గేట్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. వర్షాలకు మిర్చిని కాపాడుకోవడానికి రైతులకు టార్పాలిన్ పట్టాలు అవసరమన్నారు. వ్యవసాయం, ఆక్వారంగాలపై ఆధారపడిన బాపట్ల జిల్లాను అగ్రగామిగా నిలబెట్టడానికి అధికారులు, ప్రజాప్రతినిధులూ అందరూ సహకరించాలని కలెక్టర్ వెంకట మురళి కోరారు. శాంతిభద్రతలు కాపాడాడానికి, గంజాయి సమస్యను పూర్తిగా అరి కట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వరరావు, డీఆర్‌వో సత్తిబాబుతో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యేల డిమాండ్

సీఎం చంద్రబాబునాయుడి మానస పుత్రికలైన బిందు, తుంపర సేద్యం వంటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. గడచిన ఐదేళ్లలో బిందు, తుంపర సేద్యానికి లక్ష్యాలు విధించుకోవడం తప్ప పని చేయలేదన్నారు.

● ఫార్మింగ్ సంఘాల పేరుతో రుణాల పేరిట వైసీపీ నేతలు కోట్లు దండుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రుల దృష్టికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు తీసుకొచ్చారు. పల్లెకోనలో అడ్డగోలుగా ఆక్వా చెరువులు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కొల్లూరులో ఇటుక రాయి బట్టీల కొరకు జరుగుతున్న అక్రమ తవ్వకాలను అరికట్టాలన్నారు. సాగునీటి కాల్వల మరమ్మతులపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు

● బాపట్లలో గంజాయిని అరికట్టాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ డిమాండ్ చేశారు. ఇసుక మాఫియా వల్ల కృపానగర్, దేవాయిపేట, ప్రాంతంలో కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయని, సముద్రాన్ని కూడా వదలకుండా తవ్వకాలు జరిపారన్నారు. ఇసుక దందాలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ నేతపై దృష్టిపెట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఇష్టారీతిన ఇసుక తవ్వకాల వల్ల మత్స్యకారులు బోట్లు కూడా నిలుపుకోలేని పరిస్థితి తలెత్తిందన్నారు. కాల్వలపై బ్రిడ్జీల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఇస్తానని ఎమ్మెల్యే నరేంద్రవర్మ అన్నారు.

అద్దంకిలో మారుతున్న అధికార దర్పం

అద్దంకి, జూలై 10: టీడీపీ కూటమికి అధికారం దక్కడంతో అద్దంకి మున్సిపాలిటీలో అధికార దర్పం తీరులో మార్పు కనిపిస్తోంది. గతంలో టీడీపీ కౌన్సిలర్లు కనిపిస్తే దూరంగా వెళ్లిన మున్సిపల్ అధికారులు ప్రస్తుతం ప్లేట్ ఫిరాయించారు. టీడీపీ కౌన్సిలర్లు ఏడుగురు ఉన్నా, వారి వార్డుల్లో అభివృద్ధి పనులకు సంబంధించి అర్జీలు తీసుకునేందుకు అధికారులు, చైర్‌పర్సన్ అనుమతించలేదు. అత్యవసరమై ఏదైనా పని చేపట్టినా ఆ వార్డు వైసీపీ ఇన్‌చార్జి సలహాతో చైర్‌పర్సన్ నేరుగా ఆ అంశాన్ని అజెండాలో చేర్చే వారు. మున్సిపల్ సమావేశంలో టీడీపీ మహిళా కౌన్సిలర్లు వణికి పోయే పరిస్థితి ఉండేది. వారి వార్డులకు సంబంధించి ప్రశ్నిస్తే పలువురు వైసీపీ కౌన్సిలర్లు రన్నింగ్ కామెంటరీ చేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతో పలువురు టీడీపీ మహిళా కౌన్సిలర్‌లు సమావేశం ముగిసిన తర్వాత కంటతడి పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇటీవల అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంత్రి కావడంతో మున్సిపాలిటీలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. గతంలో టీడీపీ కౌన్సిలర్లను దరిదాపులకు కూడా రానివ్వని అధికారులు ఇప్పుడు ఆయా వార్డుల్లో ఏయే పనులు చేపట్టాలో పర్యటించి మరి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. టీడీపీ కౌన్సిలర్లు ఏడుగురు, సార్వత్రిక ఎన్నికలకు ముందు 13, 19 వార్డుల కౌన్సిలర్లు విజయలక్ష్మి, యేజెండ్ల నాగరాజు టీడీపీలో చేరారు. మంత్రి నిర్వహించిన సమీక్ష రోజు వైస్ చైర్మన్ దేసు పద్మేష్ కూడా హాజరై పరోక్షంగా తన మద్దతూ టీడీపీ వైపే అనే సంకేతాలు ఇచ్చారు. మరో కౌన్సిలర్ పూర్తిగా టీడీపీ నాయకులకు టచ్‌లోకి పోవడంతో టీడీపీ పక్షాన నిలిచే కౌన్సిలర్ల సంఖ్య 11కు చేరనుంది. ఈ పరిస్థితులను గమనిస్తున్న వైసీపీ కౌన్సిలర్లు తమ నోళ్లకు ప్లాస్టర్ వేసుకుని ఉండాలన్న నిశ్చయానికి వచ్చినట్లు తెలుస్తుంది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఈఈ ఆగ్రహం

కొప్పెరపాడు సబ్ స్టేషన్‌లో మందు పార్టీ ఘటనపై

షిఫ్ట్ ఆపరేటర్ తొలగింపు

విచారించిన విద్యుత్ విజిలెన్స్ అధికారులు



మద్యం పార్టీ ఘటనపై విచారణ చేపడుతున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, జూలై 10 : విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మార్టూరు సబ్ డివిజన్ విద్యుత్ శాఖ డీఈఈ ఎం.సురేంద్రబాబు హెచ్చరించారు. బుధవారం ఆంధ్ర జ్యోతిలో సబ్ స్టేషనా.. మద్యం దుకాణమా అనే కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. డీఈఈ సురేంద్రబాబు కొప్పెరపాడు సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి సోమవారం రాత్రి మద్యం పార్టీ జరిగిన విషయమై సిబ్బందిని విచారించారు. ఆసమయంలో ఎవరు ఉన్నారు ఉన్నదీ ఆరా తీశారు. వైదన గ్రామస్థులు విద్యుత్ సరఫరా లేకపోవ డంతో రాత్రి సమయంలోఏ అక్కడకి రాగా సిబ్బంది కొందరు పుట్టిన రోజు పండగ వేడుకలు జరుపుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై డీఈఈ సిబ్బందిని ప్రశ్నించారు. ఎవరైనా డ్యూటీ సమయంలో మద్యం సేవించి విధులకు హాజరైతే వెంటనే వారిపై కేసులు నమోదు చేసి విధుల నుంచి తప్పిస్తామని అయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా విద్యుత్ సమస్యపై ఫోను చేస్తే వారికి సరైన సమాధానం చెప్పాలన్నారు. ఈ విచారణలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్ ఖాజావలి విధుల నుంచి తొలగింపు

మండలంలోని కొప్పెరపాడు సబ్ స్టేషన్‌లో మద్యం పార్టీ జరిగిన సమయంలో సోమవారం రాత్రి విధులలలో ఉన్న షిఫ్ట్ ఆపరేటర్ ఖాజావలిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు మార్టూరు విద్యుత్ సబ్ డివిజన్ డీఈఈ సురేంద్రబాబు తెలిపారు. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనం మేరకు విచారణ జరిపామని చెప్పారు. ముందస్తుగా డ్యూటీలో ఉన్న వారిని బాధ్యులను చేస్తూ షిఫ్ట్ ఆపరేటర్‌ను తొలగి స్తున్నట్లు అయన తెలిపారు.

పార్టీపై విచారణ

కొప్పెరపాడు సబ్ స్టేషన్‌లో మద్యం పార్టీ జరిగిన ఘటనపై బుధ వారం ఒంగోలు ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు హెడెకానిస్టేబుల్ మల్లికార్జునరావు విచారణ జరిపారు. అసమయంలో విధులలో ఉన్న సిబ్బందిని విచారించారు. అలానే వైదన గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు అనే యువకుడు రాత్రి సమ యంలో రాగా అక్కడ మద్యం పార్టీ జరుగుతుందని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడిని కూడా పిలిపించి విచారణ జరి పారు. రాత పూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారు లకు అందజేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. మద్యం పార్టీ జరిగిన సమయంలో పలు గ్రామాలకు చెందిన విద్యుత్ సిబ్బంది కూడా ఉన్నారని దానిపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరిపి వారిపై కూడా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ విద్యుత్ వినియోగంపై విజిలెన్స్ తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

వేటపాలెం(చీరాల), జూలై 10 : విద్యుత్ అక్రమ వినియోగంపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. మండల పరిధిలోని రూరల్ సెక్షన్‌లో బుధవారం విజిలెన్స్ ఈఈ కట్ట వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఈఈ జాన్ థామస్, విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ క్రమంలో అధికారులు వివరాలు వెల్లడించారు. మొత్తం 2,500 సర్వీసులను తనిఖీ చేసినట్లు చెప్పారు. వాటిలో అధిక లోడుకు సంబంధించి 127 కేసులు, మాల్ ప్రాక్టీసుకు సంబంధిం చి 4 కేసులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించి ఒక కేసు మొత్తం 132 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయా కేసులకు సంబంధించి రూ.6,35,000 జరిమానా విధించారు. ఈ తనిఖీలలో చీరాల డీఈఈ టి.శ్రీనివాసరావు, పర్చూరు డీఈఈ ఎస్.రమేష్, వేటపాలెం రూరల్ ఏఈ వి.భాస్కరరావు, చీరాల డివిజన్ ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు డిజిటల్‌గా చెల్లించుకోవచ్చు

ఇకపై విద్యుత్ వినియోగదారులు తాము వినియోగించుకున్న విద్యుత్‌కు సంబంధించిన బిల్లులు ఆర్‌బీఐ నిబంధనల మేరకు డిజిట ల్‌గా ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌లలో చెల్లించవ చ్చని ఈఈ జాన్‌థామస్ తెలిపారు. అందుకు సంబంధించి గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీసీపీడీసీఎల్ కన్జూమర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించవచ్చన్నారు. అలానే డెబిట్, క్రెడిట్, నెట్‌బ్యాం కింగ్, వాలెట్స్, కాష్ కార్డ్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకో వాలని అధికారులు సూచించారు.

ప్రాజెక్టుల సీఈగా రవికుమార్



సీఈ రవికుమార్

నేడు బాధ్యతలు స్వీకరణ

ఒంగోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జలవన రుల శాఖ ప్రాజెక్టుల విభాగంలో ఒంగోలు చీఫ్ ఇంజనీర్(సీఈ)గా కడియాల రవికుమార్ నియామితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జలవన రుల శాఖ పరిధిలో 27మంది వివిధస్థాయి ఇంజనీరింగ్ అధికారులకు పదోన్నతులతో పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ గతరాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో ఇప్పటివరకు విజయవాడలోని అంతర్రాష్ట్ర జలాల పర్యవేక్షణ విభాగంలో ఎస్ఈగా పనిచేస్తున్న రవికుమార్‌ను ఒంగో లులో ప్రాజెక్టుల సీఈ పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఇక్కడ రెగ్యులర్ సీఈగా పనిచేస్తున్న మురళీనాథ్‌రెడ్డి మార్చి 31న ఉద్యోగ విరమణ చేయగా అనంతపురం సీఈగా ఉన్న శ్రీనివాసరెడ్డిని ఇన్‌చార్జీగా అప్పటి ప్రభుత్వం నియమించింది. ఆయన కూడా జూన్ 30తో ఉద్యోగ విరమణ చేయడంతో ఆ ఖాళీలో ప్రస్తుతం రవికుమా ర్‌ను నియమించారు. కాగా రవికుమార్ ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వకాలంలో జలవనరులశాఖ ఒంగోలు సర్కిల్ ఎస్ఈగా సుమారు రెండేళ్లు పనిచేశారు. సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు, నీరు-చెట్టు కార్యక్రమ పనులు ఆ సమయంలో భారీగా జరిగాయి. తాజాగా ప్రాజెక్టుల సీఈగా నియమితులైన రవికు మార్ బుధవారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాలో ప్రాజెక్టుల సీఈ పర్యవేక్షణలో వెలిగొండ, గుండ్లకమ్మ, సంగమేశ్వర ప్రాజెక్టులతోపాటు రామతీర్థం రిజర్వాయర్ అలాగే రాష్ట్రంలోని ఎస్ఎస్ పీ ఆయకట్టు ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో రవికుమార్ సీఈగా నియ మితులు కావడం విశేషం. వెలిగొండ, గుండ్లకమ్మతోపాటు ఇతర ప్రాజె క్టుల పనులు సాగునీటి పర్యవేక్షణ మరికొంత మెరుగుపడే అవకాశం ఉంది.

ఇంటర్ సర్టిఫికెట్లు సిద్ధం

ఒంగోలు(విద్య), జూలై 10 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వ ర్యంలోని జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది మార్చి, అడ్వాన్స్‌డ్ సప్లి మెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఒరిజనల్ పాస్ సర్టిఫికెట్లు(పెద్ద మార్కులు జాబితాలు) కళాశాలలకు పంపిణీ చేసేందుకు స్థానిక ఆర్ఐఓ కార్యాలయంలో సిద్ధంగా ఉంచి నట్లు ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు. జూనియర్ కళాశాలల ప్రిన్సి పాల్స్ అందరూ ఆర్ఐఓ కార్యాలయానికి వచ్చి పాస్ సర్టిఫికెట్లు తీసుకె ళ్లాలని ఆయన కోరారు. విద్యార్థులకు వెంటనే పాస్ సర్టిఫికెట్లు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

పెడదారి..!



గంజాయి అడ్డాగా మారిన పశ్చిమ ప్రకాశం

మత్తుకు బానిసలవుతున్న యువత

రాత్రుల్లో శబ్దకాలుష్యంతో బైక్ రైడింగ్

గ్రూపులకు ఏర్పడి రోడ్లపై సంచారం

హైవేపై లారీలను ఆపి దందా

వరుసగా వెలుగుచూస్తున్న ఘటనలు

మార్కాపురం/కంభం, జూలై 10: మార్కాపురం డివిజన్‌లో గంజాయి వినియోగం తారస్థాయికి చేరింది. వందలాది మంది యువత మత్తుకు అల వాటు పడ్డారు. వారిలో పేద, ధనిక అనే తేడా లేకుండా అన్నివర్గాల వాళ్లు ఉన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చాలామంది గంజాయి మత్తుకు బానిస లయినట్లు తెలుస్తోంది. పట్టణంలోని అన్ని ప్రాంతా ల్లోనూ విచ్చలవిడిగా యువత గంజాయి సేవిస్తు న్నారు. మత్తు పదార్థం వారికి అందుబాటులో ఉండటంతో ఆ వైపులో రెచ్చిపోతున్నారు. దీంతో వీరి విచ్చలవిడితనం ఎక్కువైంది. చివరికి మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని ఓ ఇంట్లోనే గంజాయి మొక్కలు పెంచుతున్నారంటేనే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్కా పురం పట్టణానికి కంభం, గిద్దలూరు, నంద్యాల ప్రాంతాల నుంచి గంజాయి సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. నల్లమల అటవీ ప్రాంతం చుట్టుపక్కల నుంచి గంజాయిని సేకరించి ఇక్కడ అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. ఒక్క మార్కాపురం పట్ట ణంలోనే రోజుకు సుమారు రూ.లక్ష మేర గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని అంచనా. గ్రామీణ ప్రాంతాలకు సైతం ఈ వ్యసనం పాకినట్లు తెలు స్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుశాఖ కఠిన చర్యలు చేపట్టకుంటే గంజాయి వినియోగాన్ని అరికట్టడం కష్టమే.

- మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక గొడవ జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సిబ్బంది అక్కడకు వెళ్లారు. గంజాయి మత్తులో గొడవపడుతున్న యువకులు అక్కడికి వచ్చిన పోలీసులపై కూడా దాడికి తెగబడ్డారు. దీంతో భయపడి పోలీసు సిబ్బందే అక్కడ నుంచి పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది.

- స్థానిక ఏబీఎం పాఠశాల వద్ద యువకులు గొడవప డుతున్నారు. మీరు ఎందుకు గొడవపడుతున్నారని అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఆ గుంపును వారించాడు. దీంతో పూర్తిగా గంజాయి మత్తులోవున్న ఓ యువ కుడు సర్జికల్ బ్లేడుతో వారించిన ఆ వ్యక్తిపై దాడికి తెగబడ్డాడు. ఆ వ్యక్తి అప్రమత్తంగా ఉండడంతో కొద్దిలో ప్రాణాపాయం తప్పింది.

- స్థానిక నాగులవరం రోడ్డులోని ఓ సినిమా థియేటర్ ప్రాంతంలో చీకటి పడితేచాలు యువత రెచ్చిపో తోంది. రోడ్డున వెళ్లే వారిని ఎవరినీ వదలకుండా గొడవలు పెట్టుకోవడం, దాడులకు దిగడం రివాజుగా మారింది. పోలీసులకు ఎన్నిమార్లు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

- స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఓ ప్రైవేటు వైద్యశాల దగ్గర నిర్మానుష్యంగా ఉన్న సందులో నిత్యం పదుల సంఖ్యలో యువత గంజాయి సేవిస్తుంటారు. మత్తు ఎక్కువై పలు సంద ర్భాల్లో వారిలో వారే రోడ్డుపైకి వచ్చి పలుమార్లు దాడులు చేసుకున్న ఘటనలు ఉన్నాయి.

గంజాయి సేవించి మత్తులో ఆకతా యిలు చేస్తున్న అకృత్యాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. వెలుగులోకి రానివి అనేకం ఉన్నాయి. పశ్చిమ ప్రకాశంలో గంజాయి ముఠాలు రెచ్చిపోతున్నాయి. యథేచ్ఛగా సంచ రిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతు న్నాయి. కొన్నిచోట్ల ఆ మత్తులో యువకులు దాడు లకు పాల్పడుతున్నారు. పోలీసులు, ఇతర యంత్రాంగం ఈ విష సంస్కృతిపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరు తున్నారు.

కంభం ఘటనతో పోలీసుల అప్రమత్తం

తీగ లాగితే డొంక కదిలినట్లుగా కంభంలో పలువురు యువకులు మ త్తు పదార్థాలు సేవించి బహిరంగంగా తిరుగుతూ గత సోమవారం పోలీ సులకు పట్టుబడ్డ సంగతి తెలిసిందే. వీరి వద్ద 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వీరికి యర్రగొండపా లెం నుంచి

ప్రతి ం ో జు గంజాయిని సరఫరా చేస్తు న్నట్లు గుర్తించారు. పోలీసులు స్పం దించి యర్రగొండపాలెం, మా ర్కాపురంలలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారి స్తున్నట్లు తెలిసింది. పశ్చిమ ప్రకాశంలో సువిశాల అటవీ ప్రాంతాలు గంజాయి సాగుకు అడ్డాగా మారినట్లు తెలు స్తోంది.

ఉక్కుపాదం మోపాల్సిందే..

గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చిందని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలుమార్లు విమర్శించారు. ఉపాధి అవకాశాలు లేక యువత మత్తు పదార్థాలకు అల వాటుపడ్డారని ఆయన పదేపదే ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వస్తే గంజాయి మత్తు నుంచి యువతను కాపాడుతానని ఆయన ప్రజ లకు హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హోంమంత్రిగా అనిత బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రథమ ప్రాధా న్యతగా గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమయ్యారు. అందులోభాగంగా ఇప్పటికే పోలీసు, ఎక్సైజ్‌శాఖలకు గంజాయిని అరికట్టేం దుకు 100 రోజుల కార్యక్రమం రూపొందించారు. ముందుగా సాగుపై ఆ తర్వాత రవాణాపై దృష్టి సారించాలని ఆదేశించారు. అంతేకాక గంజాయి కేసుల్లో జైళ్లలో ఉన్న వారిని కూడా ఆమె స్వయంగా వెళ్లి మాట్లాడారు. వారి పరిస్థితిని చూసి త్వరలో డీఎ డిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేప ట్టారు. గంజాయి మత్తుకు బానిసలైన యువత మార్కాపురం డివిజన్‌లోనూ పెద్దసంఖ్యలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా డీఎడిక్షన్ సెంటర్ పెంటాల్సిన అవసరం ఉంది.

రోడ్లపై హల్‌చల్

గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గంజాయి, ఇతర మత్తుపదార్థాలు సాగు చేసేవారు ఎక్కువయ్యారు. పలుచోట్ల వ్యవసాయ పొలాల్లో గంజాయి సాగు చేస్తూ కొంతమంది పట్టుబడినప్పటికీ, అప్పటి రాజకీయ నాయకుల ఒత్తిడి వలన సంబంధిత అధికారులు కేసులు నమోదు చేయకుండా వదిలేసిన ఘటనలు ఉన్నాయి. దీంతో గంజాయి సరఫరా చేస్తూ అధిక మొత్తంలో సొమ్ము చేసుకునే వారి సంఖ్య, మత్తులో తూగే యువత సంఖ్య ఎక్కువైంది. గంజాయి సేవించిన యువత రోజూ అర్ధరాత్రి తరువాత హైవే రోడ్డుపై లారీ లను ఆపి డ్రైవర్లను బెదిరిస్తూ అక్రమ దందా చేస్తున్నారు. రేషన్‌బి య్యంతో వెళుతున్న వాహనాలను ఆపి బెదిరించిన ఘటనలు ఉన్నాయి. ఇక రోజూ బైకులకు సైలెన్సర్లు తీసేసి వేగంగా నడుపుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు రాత్రివేళ నిఘా వేసి హైవే రోడ్లపై దందాకు పాల్పడేవారిని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

పొగాకు మార్కెట్లో సంక్షోభం

తొమ్మిది కేంద్రాల్లో నిలిచిన వేలం

అధికోత్పత్తి కొనుగోలుపై తేల్చని కేంద్రం

దక్షిణాది రైతుల వద్ద ఇంకా 49 మిలియన్ కిలోల పంట

ఆశాజనక వేళ ఆందోళన



పొగాకు

ఒంగోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో సంక్షోభం నెలకొంది. ఈ ప్రాంతంలోని 11 వేలంకేంద్రాల్లో ఏకంగా తొమ్మిది చోట్ల కొనుగోళ్లు నిలిచిపోగా రెండింటిలో మాత్రమే జరుగు తున్నాయి. పండిన పంటలో రైతుల వద్ద ఇంకా మూడో వంతు పంట ఉండగా ఈ సమయంలో కొన్ని కేంద్రాల్లో పదిరోజులు, మరికొ న్నింటిలో వారం రోజులుగా వేలం నిలిచిపోయింది. గతంలో ఎన్నడూ లేనంత డిమాండ్ ఈ ఏడాది పొగాకుకు ఉంది. పొగాకు బోర్డు చరి త్రలో ఎన్నడూ లేనివిధంగా గరిష్ఠ ధర ఏకంగా కిలో రూ.365కి చేరింది. ఎక్కువశాతం మేలురకం పంటను కిలో రూ.300పైనే వ్యాపా రులు కొనుగోలు చేశారు. మీడియం, లోగ్రేడ్‌లకు సైతం భారీగానే ధరలు లభించాయి. అలా ఇప్పటివరకు 90 మిలియన్ కిలోలు కొను గోలు చేయగా సగటున కిలోకు రూ.252.33 ధర లభించింది. ఈ స్థాయి ధరలు ఇటు రైతులు, అటు బోర్డు అధికారులు ఊహించలేదు. అంతర్జాతీయంగా పంట ఉత్పత్తి తగ్గడంతో ఇక్కడ భారీ డిమాండ్ ఏర్పడి ఆమేర ధరలు లభించాయి. కారణం ఏదైనా భారీగా ధరలు లభించడంతో ఆనందంలో ఉన్న రైతులు ఒక్కసారిగా వేలంకేంద్రాలు నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అధిక పంట ఉత్పత్తిపై కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి స్పష్టత రాకపోవడంతో బోర్డు అధికారులు అనుమతించిన మేర పంట కొనుగోళ్లు పూర్తయిన కేంద్రా లలో వేలం నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

భారీగా సాగు.. అలాగే దిగుబడి

దక్షిణాదిలో 2023-24 సీజన్‌కు88.66 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే పలు కారణాలతో భారీగా పొగాకు సాగు జరిగి ఏకంగా 139 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా. అంటే అనుమతించిన 88.66 మిలియన్ల కన్నా దాదాపు 51 మిలియన్లకుపైగా ఉత్పత్తి పెరిగింది. ఏకంగా 51శాతంకు పైగా పెరగడం ఇదే ప్రథమం. కాగా గతంలో అధికోత్పత్తిలో 10శాతం మించితే అపరాధ రుసుం వసూలు చేసి కొనుగోలు చేసే వారు. అనుమతించిన పంట కొనుగోలు పూర్తయ్యేలోపు దీనిపై స్పష్టత వచ్చేది. అయితే ఈ ఏడాది ఆ విషయంలో తీవ్రజాప్యం జరి గింది. కర్ణాటకలో వరుసగా రెండేళ్లు, ఆంధ్రలో గత ఏడాది అధిక ఉత్పత్తిపై అపరాధ రుసుంను రద్దుచేయగా ఈ ఏడాది కూడా రద్దు చేసి కొనాలని ఇక్కడి రైతులు పొగాకు బోర్డును కోరారు. అందుకు కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి అనుమతి కోసం బోర్డు అధికా రులు లేఖ రాశారు. దానిపై కేంద్రం నుంచి దాదాపు పక్షం రోజులుగా స్పష్టత రాలేదు. ఈ లోపు దక్షిణాదిలోని పలు వేలం కేంద్రాలలో అధికారిక పంట ఉత్పత్తి కొనుగోళ్లు ముగిశాయి. దీంతో వాటిలో వేలం ఆగిపోయింది.

మేలురకమే అధికం

అలా దక్షిణాదిలోని 11 కేంద్రాలలో ఏకంగా తొమ్మిది చోట్ల ప్రస్తుతం వేలం ఆగిపోగా టంగుటూరు, పొదిలిలోనూ మాత్రమే జరుగుతోంది. అదేసమయంలో రైతుల వద్ద దాదాపు 49 మిలియన్ కిలోల పంట ఉంది. అందులో కూడా మేలు రకం అధికం. ఆ రకం పొగాకు మంచి ధరలు ఇప్పటివరకు ఉన్నాయి. సోమ, మంగళవారాల్లో కిలో గరిష్ఠ ధర రూ.365 పలికింది. అలా చూస్తే రైతుల వద్ద ఉన్న పంటకు మంచి ధరలు లభించే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో అధికోత్పత్తి కొనుగోలుపై కేంద్రం స్పష్టత ఇవ్వక వేలం నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈ విష యంపై దృష్టిసారించాలని రైతాంగం కోరుతున్నారు.

జోరుగా నీటి అక్రమ వ్యాపారం

ట్యాంకరు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు

కార్పొరేషన్ అధికారుల కళ్లకు గంతలు

ఐడీఎస్‌ఎంటీ స్థలాల్లో అక్రమ బోర్లు



నీటిని నిల్వ చేసి పంపింగ్ కోసం సిద్ధం చేసిన మోటార్

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 10 : ప్రజల తాగునీటి అవసరాలను కొందరు వ్యాపారంగా మార్చుకున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా అనధి కార బోర్లు ఏర్పాటు చేసి దోచుకుంటున్నారు. ఒక్కో పాయింట్ ద్వారా రోజుకు పది నుంచి ముప్పై ట్యాంకర్ల వరకు అక్రమ నీటి వ్యాపారం సాగుతోంది. ఈ తతంగమంతా ఏ మారుమూ ల ప్రాంతాలలో జరుగుతుందనుకుంటే పొరపా టుపడ్డట్టే. ఒంగోలు నగరం నడిబొడ్డులో కొండను ఆసరాగా చేసుకుని సాగిస్తున్న వ్యాపారం. స్థానిక భాగ్యనగర్‌లోని డ్వామా కార్యాలయం ఎదురు ఐడీఎస్ఎంటీ స్థలాలుగా పిలవబడే ఈ ప్రాంతంలో గత కొన్ని నెలలుగా యథేచ్ఛగా నీటి వ్యాపారం సాగుతోంది. కనీసం కన్నెత్తి చూసే అవకాశం కూడా లేకుండా సాగిస్తున్న వ్యాపారం వెనుక భారీ ఎత్తున దోపిడీ జరుగుతున్నట్లుగా సమాచారం.

కాసులు కురిపిస్తున్న నీటి వ్యాపారం

ఒంగోలు నగరపాలక సంస్థ యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలో కొన్ని ట్యాంకర్లు నీటిని సరఫరా చేస్తున్నాయి. అయితే ముందస్తుగా కుదు ర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ ట్యాంకర్లు ప్రైవేటు నీటి సరఫరాకు అనుమతి లేదు. కానీ ప్రైవేటులో ఇష్టారాజ్యమైపోయింది. డ్రైవర్లే కీలక సూత్రధారులుగా అక్రమ నీటి వ్యాపారానికి తెరతీశారు. ఇక్కడ నీరు పుష్కలంగా లభి స్తుందని తెలిసిన వారు నీటి ట్యాంకరు కావాలని వారిని కోరితే ఇవి అమ్మేవి కావు, రిమ్స్ రోగుల కోసమే అని చెబుతున్నారు. నెలవారీగా కుదుర్చుకున్న హోటళ్లు, ఇతర సంస్థలకు వాటిని సర ఫరా చేస్తూ తమ వ్యాపా రాన్ని బహిరంగంగానే కొన సాగిస్తున్నారు.

సేవ పేరుతో కాసుల దోపిడి

సొసైటీ పేరుతో బోర్డులు ఏర్పాటు చేసి, జోరుగా నీటి వ్యాపారం సాగుతోంది, ఎవరైనా ప్రశ్నిస్తే తాము సమాజ సేవ అంటూ బదులి స్తారు. పైసా డబ్బులు తీసుకోవడం లేదని బుకాయిస్తారు. అయితే వాస్తవ పరిస్థితి చూస్తే ఇక్కడ గత కొన్నేళ్లుగా నీటి వ్యాపారం సాగు తుండగా అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ విషయం కార్పొరే షన్ ఇంజనీర్ల దృష్టికి వెళ్లినా కనీసం చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం అధికారులకే తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా ఐడీఎస్ఎంటీ స్థలాల్లో ఏర్పాటుచేసిన అనధికార బోర్లను తొలగించి, అక్రమంగా చేస్తున్న నీటి వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్థాని కులు అభిప్రాయపడుతున్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్



మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 10: మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో భోజనం తింటున్న విద్యా ర్థినులతో కలెక్టర్ మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని అడిగి తెలుసుకోవడంతో పాటు అక్కడ భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. మెనూ చార్ట్‌ను పబ్లిక్‌గా డిస్‌ప్లే చేయాలని ఉపాధ్యాయు లకు సూచించారు. విద్యార్థులకు భోజనం అందించేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న కోడిగుడ్లు, వేరుశనగ చిక్కీల రికార్డులను పరిశీలించారు. వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని ప్రధానోపాధ్యా యురాలిని హెచ్చరించారు. ఈ పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతుల నిర్మాణాలను, స్టోర్‌రూములు, ఇతర వసతులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఉచిత ఇసుక ట్రాక్టర్‌కు స్వాగతం


ఇసుక ట్రాక్టర్ ముందు ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

యద్దనపూడి (మార్టూరు) జూలై 10 : వైసీపీ పాలనలో నేతలు ఇసుకను దోచుకున్నారు. ఇసుక ధర అమాంతం పెరిగి పోవడంతో పాటు దొరక్క పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చారు. వెనువెంటనే ఉచిత ఇసుకను అవసరమైన వారికి సరఫరా చేస్తుండడంతో పలు వర్గాల పేదలు, భవనిర్మాణ కార్మికులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందుకు నిదర్శనమే బుధవారం సాయంత్రం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో ఒక రైతు తీసుకువచ్చిన ఇసుక ట్రాక్టరుకు గ్రామస్తులుతో పాటు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నాయకులు ఘనస్వాగతం పలికారు.అంతేగాకుండా ఇసుక ట్రాక్టరుకు తెలుగుదేశం పార్టీ జండాలను కట్టి గ్రామంలో ఊరేగింపుచేశారు. ఈ గ్రామంలోని గన్నమనేని ఉదయ్ కుమార్ అనే రైతు చెరువు వద్ద తూమును ఏర్పాటుచేసేందుకు బుధవారం మార్టూరు లోని ఇసుకరీచ్ వద్దకు వెళ్లి 4.5 టన్నుల ఇసుకకు 2061 రూపాయలు ఆన్‌లైన్ నగదు చెల్లించారు. దాంతో రీచ్ దగ్గర ఉన్న ప్రభుత్వ సిబ్బంది రైతు తీసుకువచ్చిన ట్రాక్టరుకు ఇసుక లోడింగ్ చేయించారు.అనంతరం రైతు ఉదయ్ కుమార్ గ్రామానికి ఇసుక ట్రాక్టరును తీసుకురాగా గ్రామస్తులు ఆనందంతో స్వాగతం పలికారు. గతంలో ఇదే ఇసుకట్రాక్టరుకు 5 వేలు నుండి 6 వేలు రూపాయలు చెల్లించామని ప్రస్తుతం రెండు వేలకే అదికూడా కేవలం వివిధ టాక్సులకు మాత్రమే సొమ్ములు తప్ప ఉచితంగా ఇసుకను ప్రభుత్వం పంపిణీ చేయడం ఆనందంగా ఉందని పలువురు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ట్రాన్స్ ఫార్మర్ ఎత్తుకెళ్లిన దొంగలు

మేదరమెట్ల , జూలై 10 : మండలంలోని తమ్మవరం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. తమ్మవరానికి చెందిన ఎం.శ్రీనివాసరావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మన్‌ను కింద పడవేసి అందులోని ఆయిల్‌ను పారబోసి అందులోని రాగి వైరును ఎత్తుకెళ్లరని ఈ నెల 5వ తేదీ దొంగతనం జరిగినట్లు కొరిశపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.18,750 విలువైన ట్రాన్స్ ఫార్మర్‌ను చోరి జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొరిశపాడు ఎస్ఐ శివయ్య తెలిపారు.

ముక్తేశ్వరంలో దాహం కేకలు..!


మినరల్ ప్లాంట్ వద్ద ఫిల్టర్ చేయగా వచ్చిన వ్యర్థ నీటిని పట్టుకుంటున్న మహిళలు.. పొలాల్లో బోర్ల నీటిని ట్రాక్టర్‌పై తెచ్చుకుంటున్న ప్రజలు...ఉన్న అరకొర బోర్ల నుంచి నీటిని మోసుకుంటున్న మహిళలు... గ్రామంలో ఉన్న గిలకల బావిలో మోటార్లు వేయడంతో అడుగంటిన నీరు

- అడుగంటిన బావులు, మరమ్మతులకు గురైన చేతి పంపులు
- వాడుక నీటికీ కటకట
- పొలాలకు వెళ్లి తెచ్చుకుంటున్న ప్రజలు
- పనిచేయని పురాతన మహల్ బావి పైపులైన్
- వెంటనే చేతి పంపులను ఏర్పాటు చేసి, బావులలో పూడిక తీయించాలని విజ్ఞప్తి

బల్లికురవ, జూలై 10 : మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముక్తేశ్వరం గ్రామంలో ప్రజలు తాగు నీరు, వాడుక నీరు అందక విలవిలలాడుతున్నారు. మొన్న మొన్నటి వరకు పురాతన బావులలో ఉన్న నీటిని వినియోగించుకోగా ఇప్పుడు అవి కూడా పూర్తిగా అడుగంటడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ చేతి పంపులు కూడా ఒకటి అర మాత్రమే పనిచేస్తున్నాయని వీటితో తమ పనులు సకాంలో కావటం లేదని బిందెల ద్వారా నీటిని తోడుకొని పశువులకు ఇంట్లో వాడుకకు తెచ్చుకొనే సరికే సాయంత్రం అవుతుందని ప్రజలు వాపోతున్నారు.


మహల్ బావి నీటిని తోడుతున్న మహిళలు


మహల్ బావిలో అడుగంటిన నీరు

బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామ పంచాయతీ అనే పేరే గాని ఈ గ్రామంలో మాత్రం తాగు, వాడుక నీరు లభించడం లేదు. గ్రామంలో ఏడు ప్రభుత్వ చేతి పంపులు ఉండగా వాటిలో మూడు మరమ్మతులకు గురికాగా నీరు వస్తోంది. బావులు రెండు ఉండగా ప్రజలు ప్రైవేట్‌గా మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు బావులలో కూడా నీరు అడుగంటింది. దీంతో ప్రజలు వాడుక నీటి కోసం పొలాలకు వెళ్లి ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని రెండు మూడు రోజులకు సరిపడా నీటిని తెచ్చుకుంటున్నారు. పక్క గ్రామాల నుంచి మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. కొన్ని సమయాలలో పశువులకు తాగేందుకు నీరు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు మహిళలు వస్త్రాలను ఉతుక్కేనేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఫిల్టర్ చేశాక వచ్చే వ్యర్థ నీటిని తెచ్చుకొంటున్నారు. ఇంతటి నీటి కష్టాలు ఉన్న అధికారులుగానీ పంచాయతీ వారు గానీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఏ నోటా విన్న నీటి కష్టాలే చెప్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న తమ సమస్యలను అధికారులు ఎవరు వచ్చి పట్టించుకోవడం లేదని కొత్త చేతి పంపులు వేసే వరకు గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటిని ఇంటింటికీ అందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మహల్ బావి నీటిని పైపు లైన్ ద్వారా ఇంటింటికీ సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. వర్షాలు కురిసే వరకు పశువులకు కూడా తాగునీటి కష్టాలు తప్పవని అంటున్నారు. గిలకల బావిలో పూడిక తీస్తే కొంత వరకు మోటార్లు పనిచేసే అవకాశం ఉందని వారు తెలిపారు.

ట్యాంకర్లతో నీటిని అందించాలి



మాగ్రామంలో పురాతన బావులు, చేతి పంపుల్లో నీరు అడుగంటింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని ఇంటింటికీ అందించాలి, లేకుంటే నీటి కష్టాలు రోజు రోజుకు పెరిగే అవకాశం ఉంది.

- ముద్ద ఏడుకొండలు, ముక్తేశ్వరం

చేతి పంపులను ఏర్పాటు చేయాలి



మా గ్రామంలో కొంత కాలం నుంచి నీటి ఎద్దడి నెలకుంది. వాడుక నీరు కూడా అందుబాటులో లేదు. పశువులకు కూడా నీరు అందడం లేదు. చేతి పంపులను ఏర్పాటు చేయాలి అలానే మహల్ బావి నీటిని పైపు లైన్ల ద్వారా అందించాలి. పురాతన బావులలో పూడిక తీయించాలి. అధికారులు మర్మతులకు గురైన చేతి పంపులను వినియెగంలోకి తీసుకు రావాలి. కొందరు నీరు లేక పొలాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

- నాగండ్ల నరసింహారావు, ముక్తేశ్వరం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న డీడీఏ విజయనిర్మల

మార్టూరు, జూలై 10 : తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించగలిగిన ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కోఆర్డినేటరు ఎం.విజయనిర్మల అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ మరియు భూసార ఫలితాల ఆధారంగా సమతుల ఎరువుల వాడకంపై అవ గాహన పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజరు మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తక్కువతో నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టరు రాధాకృష్ణ, మరో శాస్త్రవేత్త ఎం.ఉషారాణి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టరు మురళీధర్, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలతో అధిక దిగుబడులు

బల్లికురవ : రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించి సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ డీడీఏ విజయనిర్మల తెలిపారు. బుధవారం బల్లికురవ మండల కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, భూసార ఫలితాల ఆధారంగా సమతుల ఎరువుల వాడకం పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, అధికారులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రతినిధులు

చీరాల, జూలై 10 : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీలలో కాంస్య పతకాన్ని సాధించింది. పతకం సాధించిన విద్యార్థిని పందరబోయిన భానురేఖను బుధవారం కళాశాలలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు అభినందించారు. వారు మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులు చదువుతో పాటు ఇతర వ్యాపకాల్లోను ముందుండే విధంగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామన్నారు. అందుకు ఇదొక నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు


ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పంగులూరు, జూలై 10 : కాపర్ వైర్ చోరీకి గురై, విద్యుత్ సరఫరా లేక ఇబ్బంది పడుతున్న వ్యవసాయ పంపుసెట్లు ఉన్న ప్రదేశాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు చోరీ జరిగిన ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ పంగులూరు సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందిస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది పంగులూరు, కొండమూరు, రేణంగివరం గ్రామాలలోని పొలాలలో ఆరు ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి రాగి వైరు చోరీకి గురైంది. దీనిపై స్పందించిన పోలీస్ అధికారులు చోరీకి సంబంధించి నమోదు చేసిన కేసుల వివరాలను విద్యుత్ శాఖ అధికారులకు అందచేయడంతో సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం పంగులూరులోని రెండు ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

అద్దంకిటౌన్, జూలై 10 : సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఇతర కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి పి. తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్స్ డే సందర్భంగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ, స్కీం వర్కర్స్, వెలుగు, మెప్మా, ఉపాధి, మధ్యాహ్నం భోజన పథకం తదితర విభాగాల కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శారద, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి సుబ్బారావు, ప్రజా సంఘాల నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని, అప్పుడే పారదర్శకమైన సేవలు అందుతాయని సీఐటీయూ బాధ్యుడు ఎన్.బాబూరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, సురేష్, ఆంజనేయులు, ఏ.బ్యూలాకుమారి, పి.ప్రమీల, జె.భూలక్ష్మి, పద్మ, మేరీ అంగన్‌వాడీ బాధ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వీర్లంకమ్మ కొలుపులు



చినగంజాం, జూలై 10 : మండలంలోని పెద గంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె పాలెం గ్రామంలో అవనిగడ్డ కుటుంబీకుల ఇలవేల్పు దేవరి పల్నాటి వీర్లంకమ్మ అమ్మవారి కొలుపులు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి ఆదివారం వరకు అమ్మవారి కొలుపులు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సత్తెమ్మ అ మ్మవారి నిలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఆలయ షష్టమ వారికోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారి కొలుపుల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. అవనిగడ్డ వారి ఆడపడుచులు, గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బల్లికురవ. జూలై 10 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎంఈవోలు వస్త్రాంనాయక్, రమేష్‌బాబు కోరారు. బుధవారం మండలంలోని కొణిదెన ప్రాథమిక పాఠశాల (హెచ్ ఈ)లో విద్యా వికాస్ కార్యక్రమంలో భాగంగా స్టూడెంట్ కిట్లను ఆయన అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సుచిగా, శుభ్రంగా భోజనం వండిపెట్టాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా పథకాలను తల్లిదండ్రులు వినియోగించుకొని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

బకాయిలు చెల్లించాలి

స్వచ్ఛభారత్ కార్మికుల డిమాండ్

పంగులూరు, జూలై 10 : గ్రామ పంచాయతీలలో స్వచ్ఛభారత్ కార్మికులుగా పనిచేస్తున్న తమకు బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని కొండమూరు, తూర్పు తక్కెళ్లపాడు గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవో కార్యాలయ కార్య పర్యవేక్షకులు రమేష్‌కు బుధవారం వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లారెడ్డి, సీపీఎం నాయకులు రామారావు, సంపంగిల వెంకటరావు, కార్మికులు పాల్గొన్నారు.


వార్డులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్, కౌన్సిలర్

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ


అద్దంకి, జూలై 10 : పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. అద్దంకి పట్టణంలోని 13 వ వార్డులో బుధవారం కౌన్సిలర్ విజయలక్ష్మితో కలిసి కమిషనర్ సైడ్ డ్రైన్‌లు, పారిశుధ్య పనులను పరిశీలించారు. మెయిన్ సైడ్ డ్రైన్ పూడిక తీత పనులు వేగవంతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైనందున వర్షపు, మురుగు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ నేత గుంటూరు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు అందించాలి

పర్చూరు, జూలై 10 : ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందజేయాలని అధికారులకు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహన్‌రావు సూచించారు. బుధవారం ఏడీఏ కార్యాలయంలో పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, యద్దనపూడి మండలాల పరిధిలోని 27 పీఏసీఎస్ సొసైటీ అధికారులతో సమవేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దిశానిర్దేశాలు చేస్తున్నట్లు తెలిపారు. తదనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న 27 సొసైటీలకు సంబంధించి 9 సొసైటీలు మాత్రమే ఎరువులు సప్లై చేసేందుకు లైసెన్స్ తీసుకున్నారని, మిగిలిన సొసైటీలు కూడా లైసెన్స్ తీసుకోవాని సూచించారు. కార్యక్రమంలో ఆయా సొసైటీల సీఈవోలు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందున్న అద్దంకి రోటరీ

ఘనంగా క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


రోటరీ నూతన కార్యవర్గ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 10 : అద్దంకిలోని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ సేవా కార్యక్రమాల్లో ముందుందని రోటరీ 3150 డిస్ట్రిక్ గవర్నర్ కె. శరత్‌చౌదరి అన్నారు. బుధవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ 2024-25 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శరత్‌చౌదరి మాట్లాడుతూ రోటరీ సంస్థలో చేరిన సభ్యులు చురుకుగా పని చేస్తూ తక్కువ వ్యవధిలోనే నాయకత్వ స్థాయికి ఏదగాలన్నారు. మహిళలను ప్రోత్సహించి రోటరీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, కోశాధికారి మలాది శ్రీనివాసరావుతో శరత్‌చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా చేరిన 8 మంది సభ్యులతో రోటరీ సహాయ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ గత సంవత్సరం చేసిన కార్యక్రమాలకు మంచి అవార్డులు వచ్చాయని ఈ ఏడాది కూడా ఎక్కువగా అవార్డు వచ్చేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని డిస్ట్రిక్ మాజీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా చిన్ని మురళీకృష్ణ రోటరీ భవనానికి 8 సెంట్లు స్థలం స్వాధీనం అగ్రిమెంట్‌ను నూతన అధ్యక్షుడు చప్పిడి వీరయ్యకు రోటరీ గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. పరిమళ ఫౌండేషన్ ఛైర్మన్, రోటేరియన్ కృష్ణరెడ్డి సమకూర్చిన కుట్టు మిషన్‌లను పేద మహిళలకు రోటరీ గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు అతిథులు, క్లబ్ సభ్యులు తదితరులు శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ పణీంద్రబాబు, రోటరీ పెద్దలు వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య), సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, సంకా బాబు, పి. ఉదయబాస్కర్ పాల్గొన్నారు.

ఫిట్టర్ పోస్టుకు రూ.5 లక్షలిస్తా!?

ఏడు డివిజన్లకు 20 ఏళ్లుగా ఒక్కరే ఫిట్టర్ • ఆయన ఉద్యోగ విరమణ చేయడంతో పోటీ

జీతం కంటే గీతం ఎక్కువే! • అనుయాయులకు అప్పగించేందుకు అధికారుల ప్రయత్నం


• రాజకీయ నాయకుల చెంతకు పంచాయితీ

మున్సిపల్ కొళాయి బిగించే ఫిట్టర్ పోస్టు రూ.5 లక్షలా!? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. నెల్లూరులోని అత్యంత వాణిజ్య ప్రాంతాలుగా గుర్తింపు ఉన్న ఆ 7 డివిజన్లలో ఒకే వ్యక్తి ఇరవై ఏళ్లుగా ఫిట్టర్‌గా ఉన్నారు. ఆయన ఉద్యోగ విరమణ చేయడంతో ఈ డిమాండ్ బయటకు పొక్కింది. ఆ పోస్టు తనకే కావాలంటూ మిగిలిన డివిజన్లలోని ఫిట్టర్లు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు తెగ పోటీపడుతున్నారు. డబ్బులు చేతిలో పట్టుకుని అధికార పార్టీ నాయకుల వద్ద పంచాయితీ చేస్తున్నారు.

నెల్లూరు(సిటీ), జూలై 10 : నెల్లూరులోని పాత మున్సిపల్ పరిధిలోకి వచ్చే పుత్తాఎస్టేట్, శివగిరికాలనీ, మనుమసుద్దీన్ నగర్ నుంచి ఇరగాలమ్మ సంగం వరకు, ఇటు పాతమున్సిపల్ ఆఫీసు నుంచి సుబేదార్‌పేట వరకు, అటు ట్రంకురోడ్డు నుంచి వీఆర్సీ కూడలి వరకు, చిన్నబజారు నుంచి చేపల మార్కెట్ (డైకస్ రోడ్డు) వరకు, ఇలా అత్యంత ఖరీదైన వాణిజ్య ప్రాంతాలన్నీ 7 డివిజన్ల పరిధిలోకి వస్తాయి. ఇక్కడ 20 ఏళ్లుగా ఫిట్టర్‌గా పని చేస్తున్న ఉద్యోగి గత నెలలో పదవీ విరమణ చేశారు. దీంతో ఆ పోస్టు పొందేందుకు మిగిలిన డివిజన్లలోని ఫిట్టర్లు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు పోటీపడుతున్నారు. ఇళ్లకు మున్సిపల్ కొళాయి కనెక్షన్ ఇస్తే రూ.10 వేల నుంచి 25 వేల వరకు తీసుకుంటారు. అదే అపార్టుమెంటైతే రూ. 50 వేల నుంచి 70 వేల వరకు ఇవ్వాల్సిందే. ఇదంతా అనధికారికంగానే. రూపాయి కూడా కార్పొరేషన్ ఖజానాకు జమ కాదు. ఇలా ఈ 7 డివిజన్లలో రోజుకు సరాసరిన 2 నుంచి 6 కొళాయిల వరకు గిరాకీ ఉంటుంది. ఈ లెక్కన వచ్చే ఆదాయాన్ని పసిగట్టిన మిగిలిన డివిజన్లలోని ఫిట్టర్లు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు ఆ పోస్టు పొందేందుకు రూ. 5 లక్షల వరకు పెట్టుబడి పెట్టేందుకు కూడా పైరవీలు చేస్తున్నారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

• నేత వద్దకు చేరిన పంచాయితీ

వాణిజ్యపరంగా అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఫిట్టర్ పోస్టు కోసం పలువురు ఫిట్టర్లు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు పోటాపోటీగా ఉన్నారు. ఈ 7 డివిజన్లు సిటీ నియోజకవర్గ పరిధిలోకి రావడంతో ఇక్కడ అధికార పార్టీ నాయకుల వద్దకు పంచాయితీ చేరినట్లు సమాచారం. ఇంజనీరింగ్‌లోని ఒకరిద్దరు ఉన్నత స్థాయి అధికారులు కూడా తమకు అనుకూలురుకు ఆ పోస్టింగ్ ఇప్పించాలని తెగ ఆరటపడు తున్నట్లు తెలుస్తోంది.



గొర్రెల పేరుతో బురిడీ!

డీఆర్‌డీఏలో ఓ కాంట్రాక్టర్ లీలలు • ఒక్కో పొదుపు మహిళ నుంచి రూ.50 వేల వసూలు

ఒక్క రాపూరులోనే రూ.25 లక్షలు దండకం • ఏడాదిన్నరగా ఇచ్చింది రూ.లక్ష విలువైన గొర్రెలే!

న్యాయం కోసం కలెక్టర్‌ను కలిసిన మహిళలు

అధికారులతో సత్సంబంధాలపై విమర్శల వెల్లువ

స్వయం ఉపాధి కోసం గొర్రెలు ఇస్తామంటూ ఓ కాంట్రాక్టర్ పొదుపు మహిళలను బురిడీ కొట్టించాడు. డీఆర్‌డీఏ అధికారుల ఒత్తిళ్లతో ఏడాదిన్నర క్రితం మహిళల నుంచి సదరు కాంట్రాక్టర్‌కు నగదు ఇప్పించారు. రోజులు గడుస్తున్నా గొర్రెలు అందకపోవడం, అధికారులూ పట్టించుకోకపోవడంతో చివరకు కలెక్టర్ ఆనంద్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకు న్నారు. రాపూరులో వెలుగులోకి వచ్చిన ఈ బాగోతం

నెల్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు స్వయం ఉపాధి కింద గొర్రెల పెంపకం చేపట్టాలని రాష్ట్రస్థాయిలో గత ప్రభుత్వంలో తీర్మానించారు. ఇందుకు పొదుపు మహిళలకు స్త్రీనిధి, ఇతర స్కీమ్‌ల ద్వారా రుణాలు సమకూర్చారు. ఒక్కో యూనిట్ విలువ రూ.50 వేలుగా నిర్ణయించి ఆ మేరకు రుణాలు మంజూరు చేశారు. ప్రతి మండలానికి కొన్ని యూనిట్లను టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఎంపిక చేసిన పొదుపు మహిళలకు ఇచ్చిన రుణాలను నేరుగా ఓ కాంట్రాక్టర్‌కు బదలాయించారు. ఈ క్రమంలో రాపూరు మండలంలో 50 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకొని ఒక్కో మహిళ ఖాతా నుంచి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.25 లక్షలను సదరు కాంట్రాక్టర్‌కు ఎటువంటి ఒప్పంద పత్రం లేకుండా అందించారు. కానీ ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకు రెండు యూనిట్లు మాత్రమే సరఫరా చేశారు. మిగిలిన 48 మంది తమ గొర్రెలు ఏమయ్యాయని అడుగుతున్నా సమాధానం చెప్పడం లేదు. కనీసం తమ డబ్బులైనా తిరిగి ఇవ్వాలని కోరుతున్నా లెక్క చేయకుండా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నట్లు బాధితులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు రూ.50 వేలను రుణం కింద మంజూరు చేశారని, ఇప్పుడు వడ్డీతో సహా ఆ రుణాన్ని చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. అయితే గొర్రెలు సరఫరా చేయకముందే డీఆర్‌డీఏ అధికారులు ఏ విధంగా సదరు కాంట్రా క్టర్‌కు డబ్బులు మళ్లిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇందులో వారి పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అయితే ఇన్నాళ్లూ డీఆర్‌డీఏ అధికారులు ఈ విషయాన్ని ఎందుకు పట్టించుకోలేదన్న అను మానాలు కూడా కలుగుతున్నాయి. మరి ఒక్క రాపూరు మండలంలోనే ఇలా జరిగిందా..? లేదా జిల్లా మొత్తం ఇదే పరిస్థితి ఉందా..? అన్నది తేలాల్సి ఉంది.



• అన్నింటా ఆ వ్యక్తే!

సదరు కాంట్రాక్టర్‌ను డీఆర్‌డీఏ ఆస్థాన కాంట్రాక్టర్‌గా పిలుచుకుంటుండటం గమనార్హం. గొర్రెలే కాదు కోళ్ల సరఫరా చేయడం, కుటీర పరిశ్రమల కింద మిషనరీ సరఫరా చేయడం వంటి అనేక కాంట్రాక్టులు కూడా ఈ వ్యక్తే చేశారని చెప్పుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చిత్తూరు జిల్లాకు చెందిన ఈ కాంట్రాక్టర్‌ను ఓ ఏపీఎం స్థాయి అధికారి జిల్లాకు తీసుకొచ్చి అన్ని వ్యవహారాలు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కాంట్రాక్టర్‌కు డీఆర్‌డీఏ అధికారు లకు మధ్య మంచి సంబంధాలు కూడా ఉన్నట్లు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పొదుపు మహిళల నుంచి రూ.లక్షలు డబ్బులు తీసుకొని గొర్రెలు సరఫరా చేయకపో యినా డీఆర్‌డీఏ అధికారులు ఎందుకు పట్టించుకోలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపితే ఎవరి పాత్ర ఎంతన్నది తేలుతుందని బాధితులు అభిప్రాయపడుతున్నారు.

నోటీసులు ఇచ్చాం

రాపూరులో గొర్రెల యూనిట్లు సరఫరాకు ఓ కాంట్రాక్టర్ పొదుపు మహిళల నుంచి డబ్బులు తీసుకొని సరఫరా చేయలేదని మా దృష్టికి వచ్చింది. దీనిపై సదరు కాంట్రా క్టర్‌కు నోటీసులు ఇచ్చాం. అసలు యూని ట్లు సరఫరా చేయకుండానే డబ్బులు ఎలా ఇచ్చారన్న దానిపై విచారి స్తున్నాం.

- కే సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

రసమన్నం తినలేకున్నాం!

• అర్ధాకలితో అలమటిస్తున్నాం • హిందీ బోధన అర్థం చేసుకోలేకున్నాం

• రోడ్డెక్కి నినదించిన గురుకుల విద్యార్థులు

కొడవలూరు, జూలై 10 : 'రసం అన్నం తినలేకున్నాము. అడిగితే దీంతోనే సర్దుకోమంటున్నారు. అది తినలేక పస్తులుంటున్నాము.' అంటూ గురుకుల విద్యార్థులు రోడ్డెక్కి నినదించారు. మండలంలోని చంద్రశేఖరపురం గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాల ఆవరణలోనే విద్యార్థులు బుధవారం ప్లకార్డులు చేతబట్టి బైఠాయించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు హిందీ మాట్లాడుతుండటంతో బోధన అర్థం కావడం లేదని ఆవేదన చెందారు. తెలుగు, ఆంగ్లం టీచర్లు లేక అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అలాగే భోజనం కూడా సరిగ్గా ఉండటం లేదని వాపోయారు. వార్డెన్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా, విషయం తెలుసుకున్న ఐసీడీసీ ఈవో ప్రమీల అక్కడకు చేరుకోగా విద్యార్థులు ఆమెతో మాట్లాడి వినతిపత్రం అందజేశారు.

• కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే

విద్యార్థుల ఆందోళన విషయం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన ఆమె ప్రిన్సిపాల్‌తో మాట్లాడటమే కాకుండా కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో ఏడుగురు గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించారు. భోజనం నాణ్యతపై ఎక్కడా రాజీవద్దని ఆదేశించారు.

కిలారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



పార్టీ కోసం నిరంతరం శ్రమించారాయన

టీడీపీ కార్యాలయంలో నేతల ఘన నివాళి

'కిలారి' సేవలు మరవలేనివి!

నెల్లూరు (వైద్యం), జూలై 10 : టీడీపీ సీనియర్ నేత, మాజీ గ్రంథాలయ చైర్మన్ కిలారి వెంకటస్వామి నాయుడు సేవలు మరువలేనివని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు కొనియాడారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు కిలారి చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భం గా నేతలు మాట్లాడుతూ టీడీపీ ఆవి ర్భావం నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కిలారి వెంకటస్వామి నాయుడు ఎంతో కృషి చేశారన్నారు. అకస్మాత్తుగా గుండె పోటుతో కిలారి మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్య నాయుడు, కంభం విజయరామిరెడ్డి, నాయకులు చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, కన్నబాబు, రాజా నాయుడు, మామిడాల మధు, సురేంద్ర రెడ్డి, గునుకుల కిశోర్, బొమ్మి సురేంద్ర, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల నియామకంపై విచారణ

• రికార్డులను స్వాధీనం చేసుకున్న డీడీ

• అన్యాయం జరిగిందని నిరుద్యోగుల ఆందోళన

నెల్లూరు (వైద్యం) జూలై 10 : జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో 2002 నుంచి చేపట్టిన 119 మంది హెల్త్ అసిస్టెంట్ల నియామకాలపై బుధవారం విచారణ జరిగింది. రీజనల్ కార్యాలయానికి చెందిన డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి బృందం డీఎంహెచ్‌వో కార్యాల యానికి చేరుకుని విచారణ జరిపింది. హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో రోస్టర్ పద్ధతి పాటించారా!? మార్కుల జాబితా ప్రకారం నిబంధనలు అనుసరించారా!? తదితర వివరాలపై దార్యాప్తు బృందం ఆరా తీసింది. ఎప్పుడెప్పుడు నియామకాలు చేపట్టారో ఆ వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ విచారణ కొనసాగింది. నియామకాల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి మీడియాతో మాట్లాడుతూ హెల్త్ అసిస్టెంట్ల నియామకాలపై వివరాలు సేకరించామని, వీటన్నిటినీ రీజనల్ డైరెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియచేస్తామని వెల్లడించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ గతంలో డీఎంహెచ్‌వోగా ఉన్న వారు ఈ నియామకాలు చేపట్టారని, పూర్తి వివరాలపై విచారణ కొనసాగుతుందని చెప్పారు. కాగా, 74 మంది నిరుద్యోగులు డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. విచారణ అధికారులను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకున్నారు. రోస్టర్, మెరిట్ ప్రాతిపదికన ఈ నియామకాలు జరపాల్సి ఉన్నా అధికారుల ముడుపులు తీసుకుని అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం విచారిస్తున్న అధికారులు



ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

• రాష్ట్రంలోనే అగ్రస్థానం మనదే!

• ఆందోళన కలిగిస్తున్న జనాభా పెరుగుదల

• ప్రజల్లో కొరవడిన అవగాహన

• నియంత్రణ చర్యలూ నామమాత్రం

• నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



జిల్లా జనాభా 26.62 లక్షలు

నెల్లూరు (వైద్యం) జూలై 10 : ఎటు చూసినా చూసినా జనాభా కనిపిస్తోంది. కుటుంబ నియంత్రణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంస్కరణలు చేపడుతున్నా జనాభా పెరుగుదల మాత్రం తరగడం లేదు. జనాభాలో నెల్లూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా జనాభా 26,62,265 మంది ఉండగా, గత ఏడాది కంటే 8వేల మందికిపైగా పెరుగుదల కనిపించింది. ప్రతి చదరపు కిలోమీటరుకు 229 మంది ఉన్నట్లు గణాం కాలు చెబుతున్నాయి. పట్టణ ప్రాంతాలలో కేవలం 31 శాతం మంది మాత్రమే జనాభా ఉంది. మిగిలిన వారు గ్రామీణ ప్రాంతాలలో ఉంటున్నారు. 2011లో జనగణన సర్వే జరగ్గా, 2020లో జనగణన జరిగినా కరోనా కారణంగా అర్ధంతరంగా ఆగిపోయింది. అప్పటికే ఉమ్మడి జిల్లాల్లో 32 లక్షల జనాభా ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితిలో జనాభాకు అనుగుణంగా అన్ని వసతులతో పాటు మౌలిక సదుపాయాల ఏర్పాట్లు కష్టంగా మారుతున్నాయి. ఆర్థిక సమస్యలతో 35 శాతం కుటుం బాలు సతమతమవు తున్నాయి. వీరిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో చక్కదిద్దలేని పరిస్థితి నెలకొంది.

• వివక్ష వీడేదెప్పుడు!?

ఆడ, మగ అన్న వివక్ష కొనసాగుతూనే ఉంది. కడుపులో ఆడబిడ్డ ఉందని తెలుసుకున్న తల్లిదండ్రులలో కొంత మంది అబార్షన్ చేయించుకుంటున్నారు. ఆడపిల్ల పుడితే ఆర్థిక సమస్యలంటూ అనేక కుటుంబాలు గర్భంలోనే పిండాలను చిదిమివేస్తున్నాయి. దీంతో స్త్రీ జననాలు దారు ణంగా పడిపోతు న్నాయి. 2001లో ప్రతి వెయ్యి మంది పురుష జననాలలో 984 మంది ఆడ శిశువులు జన్మించేవారు. ప్రస్తుతం ఆడపిల్లల జననాలు మరింత తగ్గిపో యాయి. ప్రతి వెయ్యి మంది పురుష జననాలలో 983 మంది ఆడ శిశువులు జన్మించడం ఆందోళన కలిగించే అంశం. 2025 నాటికి ఆడశిశువుల సంఖ్య 900లకు పడిపోతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం వైద్యులే. లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని, ఆడ, మగబిడ్డ అన్న వివరాలు వెల్లడించరాదని భ్రూణహత్యలపై ప్రభుత్వం చట్టాన్ని 2006లోనే తీసుకువచ్చినా నేటికి అవి పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దీంతో ఆడపిల్ల జననాల సంఖ్య నానాటికి తరిగిపోతున్నాయి. దీంతో పాటు 84.50 శాతం అక్షరాస్యత సాధించినా నిరుద్యోగ సమస్య నానాటికి జఠిలమవుతోంది. వైద్య ఆరోగ్య సేవలకు సంబంధించి దాదాపు 40 శాతం మందికి ఇంకా ప్రభుత్వ వైద్యసేవలు అందని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు, 29 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఒక జిల్లా ఆసుపత్రి, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక జనరల్ ఆసుపత్రి ఉన్నా ఇక్కడ పూర్తిస్థాయి వైద్యసేవలు అందడంలేదు.

• జనాభా దినోత్సవానికి నిధులేవి

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల్లో ప్రతిభ చూపిన వైద్యులు, స్టాఫ్‌నర్సులకు, ఆశలకు పురస్కారాలు అందచేస్తారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్న ముగ్గురిని లాటరీ ద్వారా ఎంపిక చేసి నగదు అందచేస్తారు. అయితే, ఈ కార్యక్రమాల నిర్వహణకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో వైద్య ఆరోగ్య శాఖ కేవలం ర్యాలీ మాత్రమే నిర్వహించి చేతులు దులుపుకుంటోంది.

జనాభా నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

జనాభా నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. మగవారికి నిర్వహించే వేసక్టమి శస్త్రచికిత్సలపై కూడా దృష్టిపెట్టాము. జిల్లాలో జనాభా పెరుగుదలను అరికట్టేలా కృషి చేస్తున్నాం. ఇందుకోసం కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు ఆదేశాలు జారీచేశాం. అలాగే లింగనిర్ధారణ పరీక్షలపై కూడా కఠినంగా వ్యవహరిస్తున్నాము. ఒకరు లేదా ఇద్దరు పిల్లలు మాత్రమే చాలంటూ ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులపై విస్తృత ప్రచారం చేస్తున్నాం.

- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన
- అధికారులకు వినతిపత్రాల అందజేత

ఆత్మకూరు, జూలై 10: ఐసీడీఎస్‌లను బలోపేతం చేసి అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యూటీ అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి పి.రాధ కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బుధవారం కోర్కెలదినం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఐఎల్‌సీ సిఫార్సు మేరకుకనీసం వేతనం రూ.25వేలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అములు చేయాలన్నారు. ఈ మేరకు సీడీపీవో సునీలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు శివప్రసాద్, నాగయ్య, దేవిడ్‌రాజు, సెక్టార్ లీడర్లు రమణమ్మ, సుప్రజ, విజయమ్మ పాల్గొన్నారు.

సీతారామపురం: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇతర డిమాండ్లను తీర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోడే రమణయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు జానీ, భవాని, స్రవంతి పాల్గొన్నారు.


ఆత్మకూరు సీడీపీవో సునీతకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు


ఉదయగిరి రూరల్: వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉదయగిరి రూరల్: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సందానీబాషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు గడ్డం నాగేశ్వరరావు మాట్లాడారు. అంగన్‌వాడీల అఖిల భారత కోర్కెల దినోత్సవంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేసి కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాయబ్, కార్యకర్తలు ప్రమీల, రత్నమ్మ, జయలక్ష్మి, పద్మా, రమణమ్మ పాల్గొన్నారు.

20న మండల సమావేశం

ఉదయగిరి రూరల్, జూలై 10: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. కావున సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

బాధితుడికి ఆర్థికసాయం


బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న వైద్యాధికారి శివకల్పన

ఉదయగిరి రూరల్, జూలై 10: అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యంను బుధవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన బుధవారం సిబ్బందితో కలిసి పరామర్శించారు. అనంతరం రూ.10వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆమె వెంట సీహెచ్‌వో శివకుమారి, ఏఎన్ఎంలు ఉన్నారు.

దాడి చేశాడంటూ ఏఎన్ఎం ఫిర్యాదు

అనంతసాగరం, జూలై 10: తాను విధుల్లో ఉండగా వరుసకు బావ ఈశ్వరయ్య తనను దూషించి దాడి చేసినట్లు మినగల్లు సచివాలయ ఏఎన్ఎం ఎం.అరుణ బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏఎస్‌పేట మండలంలోని జమ్మవరం గ్రామానికి చెందిన తనకు కొత్తపల్లి పంచాయతీ వడిపాలెంకు చెందని మల్లికార్జునరావుతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగిందన్నారు. తమకు సంతానం లేక పోవడంతో కొంతకాలంగా తన బావ ఆర్టీసీ డ్రైవర్ ఈశ్వరయ్య డబ్బులు ఇవ్వాలంటూ వేధిస్తూ ఇటీవల తన అకౌంట్‌లోని రూ.4లక్షలు డ్రా చేసుకొన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల దాడి చేసి కొట్టగా అనంతసాగరం పీహెచ్‌సీలో వైద్యం చేయించుకున్నట్లు పేర్కొన్నారు. తన బావతో ప్రాణహాని ఉందని అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బడులను బలోపేతం చేయాలి

అనంతసాగరం, జూలై 10: ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేలా దృష్టి సారించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, పల్లం వేణు, ఆదినారాయణ, తెలిపారు. సభ్యత్వ నమోదులో పాఠశాలను సందర్శించారు. 117జీవోను రద్దు చేయాలన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ

ఉదయగిరి, జూలై 10: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం సచివాలయం ఎదుట బుధవారం ఏవో బాలాజీనాయక్ రైతులకు పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేశారు. మండలంలోని 17గ్రామ పంచాయతీల పరిధిలోని సచివాలయాల రైతులకు నూరు శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం

ఉదయగిరి, జూలై 10: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈవోలు షేక్ మస్తాన్ వలి, తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజన పథకంలో నిబంధనలను పాటించాలన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలకేశలు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా నిలుద్దాం

ఆత్మకూరు, జూలై 10: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయినా అధైర్యపడాల్సి అవసం లేదని, ప్రతి వైసీపీ కార్యకర్తకు అండగా నిలుస్తామని రాష్ట్ర మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ వైసీపీ నాయకలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్య క్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, మాజీ ఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సంగంకు చేరిన పాదయాత్ర

సంగం, జూలై 10: నెల్లూరు 19వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి చేపట్టిన మాలకొండ పాదయాత్ర బుధవారం సంగం చేరింది. ఈ సందర్భంగా మదన్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా మూడోసారి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజయం సాధిస్తే మొక్కు తీర్చుకుంటానని మాలకొండకు మొక్కుకున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు డివిజన్‌లోని పలువురు టీడీపీ నాయకులు, శ్రీధర్‌రెడ్డి అభిమానులు ఉన్నారు.

హార్టికల్చర్ ప్లాంటేషన్‌పై సమీక్ష

వింజమూరు, జూలై 10 : మండల కార్యాలయంలో బుధవారం నియోజకవర్గస్థాయి హార్టికల్చర్ ప్లాంటేషన్‌పై సమావేశాన్ని ఏపీడీ గాయత్రీదేవి నిర్వహించారు. రాబోవు వర్షాకాలంలో గ్రామాల్లో ఏపీవోలు, ఈసీలు, టీఏలు, మొక్కలు, గడ్డి పెంపకం, పళ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీ సర్ జయ ఉన్నారు.



మంత్రి ఆనం జన్మదిన వేడుకలు


మర్రిపాడు: వేడుకలో పాల్గొన్న నాయకులు

అనంతసాగరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బుధవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మునగపాటి సునీత, ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ, చల్లా శివారెడ్డి, శాఖమూరి సుబ్బారావు, కేతా శ్రీనివాసులరెడ్డి, లక్ష్మిరెడ్డి, సుబ్బరాయుడు, ఖాసింబాష, కిరణ్ పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలకేంద్రంలో ముప్పాళ్ల వెంకట చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్‌లు పంచి పెట్టారు. అంతకుముందు రామాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో గంగినేని శ్రీనివాసులు(డీకె), మాలపాటి వెంకటేశ్వర్లు, వైస్ సర్పంచ్ చెన్నప్పనాయుడు పాల్గొన్నారు. మర్రిపాడు బస్టాండ్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో మండల నాయకులు పూజలు చేసి కేక్ కట్ చేసి, స్వీట్‌లు పంచి పెట్టారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు శాఖమూరి నారాయణ, గాలిబోయిన లక్ష్మీనరసయ్య, బంకా సుబ్బారెడ్డి, ఎలగాల వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.


అనంతసాగరంలో..

సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేశారు. మండల అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులుయాదవ్, పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి బా ణా శ్రీనివాసులురెడ్డి, మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖరయ్య, కర్నాటి రవీంద్రరెడ్డి, వాసుదేవరెడ్డి, బా బు, హరిరెడ్డి, భీమేశ్వరరెడ్డి, జనార్దన్‌రెడ్డి, పార్థసారధి, రమణయ్య పాల్గొన్నారు. వెంగారెడ్డి పాలెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, సంగంలో మాజీ సర్పంచ్ ఏ.కరణాకర్‌రెడ్డి కేక్ కట్ చేశారు.

ఏఎస్ పేట: ఖాజానాయబ్ రసూల్ దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకు న్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మం డల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, కాటంరెడ్డి నరసిం హారెడ్డి, ఏలూరి మాల్యాద్రి నా యుడు, షేక్ జిలాని బాషా, సయ్యద్ కాలేషా, పులిమి సుధా కర్ రెడ్డి, దేవరాల హజరత్తయ్య, షేక్‌ఖాదర్ బాషా, అల్లంపాటి మాధవరెడ్డి, ఖాజామియ్య, వాకిచర్ల బాబు పాల్గొన్నారు.

చేజర్ల: మండలకేంద్రంలో టీడీపీ నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మినరసారెడ్డి, సొసైటీ చైర్మన్ బూదళకల వీరరాఘవరెడ్డి ఆదురుపల్లిలో చీర్ల వెంకటేశ్వర్లు, గొల్లపల్లిలో హజరత్తయ్య, చిత్తలూరులో చిత్తలూరు యువసేన, ఏటూరు కండ్రిక గ్రామంలో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. మడపల్లి యవత రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఆలయాల్లో పలువురు టీడీపీ నేతలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముస్లిం మైనార్టీ నాయకులు దర్గా, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు మొక్కలు నాటారు. ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీఎస్ ఆర్ సెంటర్‌లో కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమాను లకు పంచిపెట్టారు. కార్యక్రమాలలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, ఎంపీ పీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, టీడీపీ రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్, చల్లా రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని ఆది ఆంధ్ర, జ్యోతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నలంద విద్యాసంస్థ అధినేత ఈగ భాస్కర్‌రెడ్డి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.


సంగంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ

ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరకు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నేతలు బుధవారం విజయవాడ వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట బుజ్జిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మర్రిపాడు టీడీపీ అధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులు స్పందించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్మకూరు, జూలై 10 : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జనావాసాల మధ్య ఖాళీ స్థలాలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఈ క్రమంలో రెండురోజుల క్రి తం ఆంధ్రజ్యోతి లో ఊరా.. వల్లకాడా..! అ నే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ము న్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపాల్టీలోని 6వ వార్డు ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసుకు ఎదురుగా ఉన్న 250 అంక ణాల ఖాళీ స్థలంలోని ముళ్ల పొదలను తొలిగించి శుభ్రం చేయడంతో హర్షం వ్యక్తం చేశారు.

మార్కెట్ మార్ట్ పరిశీలన

వింజమూరు, జూలై 10: పట్టణంలోని బంగ్లా సెంటర్‌లో పొదుపు మహిళలతో ప్రారంభించబడిన మహిళ చేయూత మార్కెటింగ్ మార్ట్‌ను బుధవారం అడిషనల్ డైరెక్టర్ మహిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు పనులతో కొంతకాలం ఆపేసిన పనులను పూర్తి చేసి పునఃప్రారంభిస్తామని ఆమె తెలిపారు. దీనిపై వచ్చిన పలు ఆరోపణలను గురించి పరిశీలనకు వచ్చామన్నారు. రోడ్డు విస్తరణ పనులతో కొంతకాలం మార్ట్‌ని నిలిపివేశామన్నారు. తిరిగి పొదుపు సంఘాలతో సమావేశం నిర్వహించి పునఃప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీ సాంబశివారెడ్డి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధిజల కేంద్రం ప్రారంభం

ఉదయగిరి రూరల్, జూలై 10: బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తపల్లి గ్రామానికి చెందిన అంబవరపు బలరామిరెడ్డి ఏర్పాటు చేసిన శుద్ధిజల కేంద్రాన్ని బుధవారం ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం మరువలేనిదన్నారు. శుద్ధిజల కేంద్రం ప్రారంభానికి సహాయ సహకారాలు అందించిన బలరామిరెడ్డిని ఎంఈఓ అభినందించారు. అనంతరం పాఠశాల మరమ్మతు పనులు పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయబ్, పీఎంసీ చైర్మన్ సుందరరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం

ఉదయగిరి, జూలై 10: స్థానిక ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయగిరి డిపో కండక్టర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన మౌలాలీకి తోటి ఉద్యోగులు, నాయకులు, బంధువులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఆయన విధి నిర్వహణలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ ఎంయూ రాష్ట్ర నాయకులు రమణరాజు, భీమవరం వెంకటేశ్వర్లు, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

నల్ల చట్టాలను రద్దు చేయాలి!

- అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

కావలి (టౌన్) : కార్మిక వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కె.రెహనాబేగం డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ట్రంకురోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాలు ఎస్‌కె రెహనా బేగం మాట్లాడారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి సెంటర్లను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమోహన్, కృష్ణయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు రఘురావయ్య, విజయలత, హిమబిందు, ఆశా యూనియన్ నాయకులు వసుంధర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తురకా శీనయ్య, రమేష్ పాల్గొన్నారు.


అల్లూరు : ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

● **అల్లూరు :** తమకు నెలకు రూ.26వేల జీతం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం ఆల్ ఇండియా కోర్కెల దినం సందర్భంగా అల్లూరులో ప్రధాన రోడ్డు నుంచి ర్యాలీగా తహసీల్దారు కార్యాలయంకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాస్కర్, రషీద్, లక్ష్మయ్య, ఎద్దల చిన్నయ్య, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

● **బిట్రగుంట :** అంగన్వాడీవర్కర్ల న్యాయమైన కోర్కెలను తీర్చాలని మండల అంగన్‌వాడీ వర్కర్లతో కలసి బోగోలు మండల సీపీఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బోగోలు మండలం కప్పరాళ్ళ తిప్ప జాతీయ రహదారి నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏవో గోవిందరావుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్ర మంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, సీఐటీయు సభ్యులు తదితరులు ఉన్నారు.

● **వలేటివారిపాలెం :** అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని బుధవారం సీఐటీయూ నాయకులు వలేటివారిపాలెం తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు కుమార్, జయలక్ష్మి, సరస్వతి, రాధ, అరుణ, జ్యోతి, సంపూర్ణ, చెంచులక్ష్మీ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం :** స్థానిక తహసీల్దారు కార్యలయం వద్ద జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ ప్రభావతి, ప్రమీల, ఎస్‌కె ఫరీమా, కృష్ణకుమారి, సుగుణ, ఎస్ మాధవి, మధులత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతం చేస్తాం : కాకర్ల


సహకార బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, జూలై 10: నూతనంగా నిర్మించిన స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు భవన నిర్మాణాన్ని బుధవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేను బ్యాంకు అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కాకర్ల ప్రసంగిస్తూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సహకార బ్యాంకు వ్యవస్థను మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జలదంకిలో సహకారబ్యాంకు నూతన బ్యాంకు శాఖను ఏర్పాటు చేయడమే కాకుండా సొంత భవనాన్ని నిర్మించడం తన చేతుమీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ బ్యాంకును మండలంలోని రైతులు ఉపయోగించుకోవాలని అదేవిధంగా డిపాజిట్లు చేయడమే కాక తక్కువ వడ్డీకి పంటరుణాలు పొంది సకాలంలో చెల్లింపులు చేసి బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలని రైతులను కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు మధుసూదనరావు, సరిత, బ్రాంచ్ మేనేజరు నాగగాయత్రి, ఎంపీపీ వెంకటరమణయ్య, జడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, మండల టీడీపీ కన్వీనర్ మధుమోహన్‌రెడ్డి, వంటేరు జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముళ్లచెట్లు, పిచ్చిమొక్కల తొలగింపు

బిట్రగుంట, జూలై 10: బోగోలు బజారు నుంచి మండల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే పంచాయతీ లింకు రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపులు, పిచ్చి మొక్కలు రోడ్డును కమ్ముకుని రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఇది గమనించిన మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు బుధవారం ఎక్స్‌కవేటర్‌తో వాటిని తొలగించారు. అనంతరం దళితవాడల నుంచి ఇబ్రహీంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు, తుప్పలను తొలగించారు. ఎమ్మెల్యే సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గనిపినేని నాగరాజు, మండల మహిళ అధ్యక్షురాలు మల్లిఅరుణమ్మ, పుచ్చకాయ రమేష్, పోతల శీనయ్య, ఆవుల సురేష్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచండి

- మున్సిపల్ అధికారులకు సబ్ కలెక్టరు ఆదేశం


సమీక్షలో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు విద్యాధరి

కందుకూరు, జూలై 10: కందుకూరు పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సబ్ కలెక్టరు జి విద్యాధరి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆమె మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులతో సమీక్షించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, వాణిజ్య ప్రాంతాలలో చెత్తను రోడ్లపై లేకుండా చేయాలని, నివాస ప్రాంతాలలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే తాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరిగేలా చూడాలని, మంచినీటి సరఫరా జరిగే సమయంలో తగు ప్రీక్లోరినేషన్ పరీక్షలు జరిపి నీటి విడుదల చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

కందుకూరు : మండలంలోని మాచవరం లో టీడీపీ కార్యకర్త తన్నీరు అయ్యల్ రెడ్డిపై వైసీపీ నేతలు దాడిచేయగా కందు కూరు ఏరియా ఆసుపత్రిలో ఉన్న బాధితుడిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు బుధవారం రాత్రి పరామర్శిం చారు. ఈ సందర్భంగా వివాదానికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్న ఆయన పార్టీ కార్యకర్తల జోలికొస్తే సహించబోమని హెచ్చరించారు. బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బడేవారిపాలెం, శాఖవరం గ్రామాలకు చెందిన మహిళలను కూడా ఆయన పరామర్శించారు. ఆయన వెంట మాచవరం టీడీపీ నేత చిరంజీవిరెడ్డి, మహేంద్ర ఉన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు


మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

కందుకూరు, జూలై 10: కందుకూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన మెరిట్ విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలల 1973-74 బ్యాచ్ పూర్వవిద్యార్థులు బుధవారం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థుల గోల్డెన్‌జూబ్లీ వేడుకలను ఓవి రోడ్డులోని రవి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా బాలికల ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన విద్యారినులు ఆకుల నాగజ్యోతి, కొర్లపాటి భావన, పిగిలి మనీషా బాలుర ఉన్నత పాఠశాలలో షేక్ జావెద్‌లకు రూ. 10వేలు వంతున, ద్వితీయ స్థానం సాధించిన సయ్యద్ ఆర్షియా, ఎం శ్రీకాంత్‌లకు రూ. 5వేలు వంతున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మంచిరాజు మురళీ, ముచ్చెలి ఉమామహేశ్వరరావు, సందానీబాషా, దోనవల్లి రమేష్, పాములూరి శ్రీను, రామమూర్తి, శశిధర్, ఉప్పుటూరి వరప్రసాద్, పువ్వాడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి అన్నసత్రానికి విరాళం


విరాళం అందజేస్తున్న రామకృష్ణ, జాహ్నవి దంపతులు

కందుకూరు, జూలై 10: పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి పట్టణానికి చెందిన అనుముల వెంకటరామకృష్ణ, జాహ్నవి దంపతులు బుధవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్పసేవాసంఘం కమిటీ సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహం, నలబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ నేతలతో ఎమ్మెల్యే దగ్గుమాటి

తిరుమలకు పాదయాత్ర

బిట్రగుంట (దగదర్తి), జూలై 10: టీడీపీ ప్రభుత్వం వచ్చే వరకు పాదరక్షలు వాడనని ఐదేళ్ల క్రితం చేసిన శపథం మేరకు దగదర్తి మండలాధ్యక్షుడు తాళ్లూరు సుధాకర్‌నాయుడు, కాట్రాయిపాడు టీడీపీ నేత సుధాకర్ నాయుడు అతని అనుచరులు బుధవారం సాయంత్రం తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. వీరికి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వారికి సంఘీభావం తెలిపి ముందుకు సాగనంపారు. ఈ సందర్భంగా శ్రీవారి దర్శనం తరువాత పాదయాత్ర చేసిన వారిని తిరుపతిలో కలుసుకుని పాదరక్షలు కొనిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదరి పమిడి రవికుమార్ చౌదరి, కావలి ఆర్యవైశ్య అధ్యక్షుడు తటవర్తి రమేష్ పాల్గొన్నారు.

● **కావలి :** స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శీనానాయక్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి ఆర్డీవోకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు ఆర్డీవో మలోల, కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ, కావలి తహసీల్దార్ నగేష్, టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

పందులను పట్టణానికి దూరంగా ఉంచాలి

కావలి : పందులను పట్టణానికి దూరంగా పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. పందుల యజమానులతో బుధవారం సాయం త్రం సమావేశం నిర్వహించారు. పందుల వలన ప్రజలకు రోగాలు వచ్చే ప్రమాదం ఉందని పారిశుధ్య నిర్వహణకు ఆటంకం కలుగుతోందని చెప్పారు. ఇక నుంచి పట్టణంలో పందులు కనిపిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

కలిగిరి, జూలై 10: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు తెలిపారు. బుధవారం వెలగపాడు, కలిగిరి-1, కలిగిరి-2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందించే సేవల్లో జాప్యం ఉండరాదని ఆదేశాలు జారీ చేశారు.

13న ఎమ్మెల్యే పర్యటన

అల్లూరు, జూలై 10 : ఈ నెల 13న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అల్లూరులో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. మండల కార్యాలయంలో తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసేందుకు వినియోగించే డబ్బాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

విద్యాసామగ్రి అందజేత

బిట్రగుంట : నాగులవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గీతామాయి ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ తమ్మినేని పాండు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పాండు అమ్మమ్మ దొడ్డపనేని వెంకమ్మ జ్ఞాపకార్థం ఇస్తునట్లు తెలిపారు.

'టీఆర్‌ఆర్'లో ఉచిత బోధన

కందుకూరు, జూలై 10: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులు చెల్లించాల్సిన నామమాత్రపు ఫీజు కూడా లేకుండా ఉచితంగా విద్యాబోధన జరిగేలా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతున్నందున పేద విద్యార్థులకు ఆర్థిక భారం కాకుండా వారు చెల్లించాల్సిన రూ.2వేలు ఫీజును తామే చెల్లించేందుకు అధ్యాపకులంతా సిద్ధపడ్డారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవికుమార్ కోరారు.

సదరం ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవాలి

లింగసముద్రం : దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవాలని ఎంపీడీవో కె శ్రీనివాసులు బుధవారం కోరారు. ప్రభుత్వం జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు స్లాట్‌లు విడుదల చేసిందని, వైకల్య ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన అభ్యర్థులు గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి ప్రభుత్వ వైద్యశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

దాడిలో మహిళకు గాయాలు

వలేటివారిపాలెం, జూలై 10: మండలంలోని అంకభూపాలపురంలో రెండు కుటుంబాల మధ్య గత మూడు రోజుల నుండి జరుగుతున్న భూవివాదం బుధవారం ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ప్రెగడ అరుణపై అక్కమ్మ, నరసింహరావు, చిన్ననారాయణ, సత్యనారాయణ, బాలనారాయణ, సులోచన, జాన్సీ, శ్రీదేవిలు కలిసి కారం, రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో ప్రెగడ అరుణ తీవ్రంగా గాయపడింది. దీంతో అరుణను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ అసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలోకి విచారణ చేయనున్నట్లు ఎస్ఐ బాలమహేంద్రనాయక్ తెలిపారు.